" మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

" మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 3-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 66 Issue: 66

Circulated to Telangana Published from Jagitial

03 సెప్టెంబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:24 తిథి సప్తమి రా. 2:24o వరకు తరువాత అష్టమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం కృతిక రా. 12:27o వరకు తరువాత రోహిణి యోగం వృషుతా సా. 6:27 వరకు కరణం విష్టి మ. 3:25 వరకు బవ రా. 2:24o వరకు వర్జ్యం మ. 1:06 నుండి మ. 2:37 వరకు దుర్ముహూర్తం ఉ. 10:12 నుండి ఉ. 11:01 వరకు మ. 3:07 నుండి మ. 3:57 వరకు రాహుకాలం మ. 1:47 నుండి మ. 3:20 వరకు యమగండం ఉ. 6:06 నుండి ఉ. 7:38 వరకు గుళికాకాలం ఉ. 9:10 నుండి ఉ. 10:43 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు రా. 10:12 నుండి రా. 11:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:40 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## 200 ఏళ్ల తర్వాత ఆడబిడ్డ పుట్టిందని..!

### రథంపై ఊరేగించి ఇంటికి అపూర్వ స్వాగతం

మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఓ కుటుంబం తమ ఇంట్లో 200 ఏళ్ల తర్వాత జన్మించిన ఆడబిడ్డకు అపూర్వ స్వాగతం పలికింది. నాలుగు తరాల నిరీక్షణకు తెరదించుతూ పుట్టిన ఆ చిన్నారిని రథంపై ఊరేగిస్తూ ఇంటికి తీసుకువచ్చి తమ అమితమైన ఆనందాన్ని చాటుకున్నారు. బీడ్ జిల్లాకు చెందిన దహిఫలే కుటుంబంలో గత రెండు శతాబ్దాలుగా ఆడపిల్లలు జన్మించలేదు.

బీడ్ (మహారాష్ట్ర): ఇటీవల ఆ కుటుంబంలోకి ఓ పాపాయి అడుగుపెట్టడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఆ చిన్నారికి 'గర్గి' అని నామకరణం చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం, తల్లీబిడ్డలను మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ రథంపై ఊరేగింపుగా ఇంటికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాప నానమ్మ సురేఖ దహిఫలే మాట్లాడుతూ, "మా ఇంట మహాలక్ష్మి అడుగుపెట్టింది. ఆసుపత్రి నుంచే పాపకు ఘనంగా స్వాగతం పలకాలని అప్పుడే నిర్ణయించుకున్నాం" అని హర్షం వ్యక్తం చేశారు. పాప తాతయ్య కూడా స్పందిస్తూ, ఇది తమ తరువాయి 2 వ పేజీలో...

## వైఎస్ యుగం రావాలె!



### కాంగ్రెస్‌లో కొత్తోళ్ల కబ్జా సహించను

### సీఎం అయ్యే టైమొస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు

### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను పరోక్షంగా వ్యక్తం చేస్తూ.. సమయం వచ్చినప్పుడు తనను ఎవరూ ఆపలేరని ఆయన వ్యాఖ్యానించారు. తనకు పదవులపై వ్యక్తిగత ఆశ లేదని చెబుతూనే రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): సమయం వచ్చినప్పుడు దేవుడి దయతో వచ్చే పదవులను ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. తాను భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతాననే ధీమాను వ్యక్తం చేసిన ఆయన.. ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా తనను ఆపలేడని వ్యాఖ్యానించారు. తనకు ఏ పదవి వచ్చినా అది వ్యక్తిగత గౌరవంగా భావించబోనని.. సామాన్యుడికి దక్కిన బాధ్యతగా భావిస్తానని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన రాజకీయ -2 వ పేజీలో...

## ..ముందు రేవంత్ పోవాలె!

### క్రమశిక్షణ చర్యలు నాపై కాదు... సీఎంపై చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే అభ్యర్థిని ఎందుకు ప్రకటించారు?.. మంత్రి కొండా సురేఖ తిరుగుబాటు!



కొండా సుష్మిత సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తనకు షోకాజ్ నోటీసు జారీ చేయడంపై ఆమె తల్లి, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదంపై అధిష్టానం ముందు తన ఆవేదనను వెలిబుచ్చేందుకు ఢిల్లీకి వెళ్లారు. అక్కడ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్‌లతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌పై తిరుగుబాటు ప్రకటించేలా కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): రాహుల్ గాంధీ మహిళలు స్వతంత్రంగా బతకాలని నిత్యం చెబుతుంటారు. నా కూతురు స్వతంత్రంగా మాట్లాడిన దానికి నన్ను బాధ్యురాలిని చేస్తూ నాకే షోకాజ్ నోటీసులు ఇస్తారా? ఖర్గేకు పరిస్థితిని వివరిస్తూ లేఖ అందించాను. ఆ లేఖలోని విషయాలు బయటకు వస్తే పార్టీలో తీవ్ర ప్రకంపనలు రావడం ఖాయం. నా కుమార్తె సుష్మితా పటేల్ మాట్లాడింది తప్పా? ఒప్పా? అనేది నేను చెప్పను. నా బిడ్డ స్వతంత్ర ఆలోచనలతో మాట్లాడింది, తనను వారించే అధికారం నాకు లేదు. నా పొలిటికల్ లైఫ్ నాది. నా వైపు ఎలాంటి తప్పు లేదనే విషయాన్ని అధిష్టానానికి స్పష్టంగా వివరించా నాపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవని, మంత్రి పదవిలో కొనసాగేలా చూడాలని అధిష్టానాన్ని కోరా. భేటీలో తన బర్తరఫ్ గురించి ఎలాంటి చర్చా రాలేదు. నాపై కుట్ర జరుగుతోందని ఆరోపించిన సురేఖ.. నాకు నోటీసులు ఇచ్చిన పార్టీ, నాపై తరువాయి 2 వ పేజీలో...



## గ్రీన్ కార్డు కావాలంటే 179 ఏళ్లు ఆగాలి

### ఈబీ-2 కార్డు కోసం శతాబ్దాల వెయిటింగ్

### భారతీయులకు సుదీర్ఘ నిరీక్షణ

అమెరికాలో ఉద్యోగం చేస్తూ శాశ్వత నివాసం (గ్రీన్‌కార్డ్) కోసం దరఖాస్తు చేసే కొందరు భారతీయులు 179 ఏళ్ల వరకు వేచి చూడాల్సి రావచ్చని 'నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ' (ఎన్‌ఎఫ్‌ఏపీ) తాజా అంచనా వెల్లడించింది. అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలో ఇతర దేశాల వారితో పోలిస్తే భారతీయులకే అత్యంత సుదీర్ఘ నిరీక్షణ ఉంటోందని తెలిపింది.

వాషింగ్టన్: డిసెంబరు 2025 నాటికి ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రేషన్ పెండింగ్ దరఖాస్తులు 12 లక్షలు దాటాయి. వీటిలో దాదాపు 10 లక్షల మంది భారతీయులే ఉన్నారు. అంటే మొత్తం పెండింగ్ దరఖాస్తుల్లో భారతీయుల వాటా 79 శాతంగా ఉంది. జనవరి 2026 లేదా ఆ తర్వాత లేబర్ సర్టిఫికేషన్ తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,202 |
| వెండి (కిలో): | రూ.2,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,253 |



## 5 వరకు రేషన్ బియ్యం పంపిణీ

### 3 నెలల బియ్యం పంపిణీ గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు:) తెలంగాణలో రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది.ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ గడువును మరో ఐదు రోజుల పాటుపొడిగించింది. దీంతో ఇప్పటివరకు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బియ్యం కోటాను తీసుకోలేకపోయిన అర్హులైన లబ్ధిదారులకు మరికొంత సమయం లభించింది. తాజా నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ కొనసాగనుంది. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యంతరువాయి 2 వ పేజీలో...

## వైఎస్ఆర్ రైతుబంధు


### రైతుల కోసం పరితపించిన నేత

### ఢిల్లీ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ: వైఎస్ఆర్ జీవించి ఉన్నంత కాలం నిరంతరం రైతుల సంక్షేమం కోసమే పరితపించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన 'వైఎస్ఆర్ అవార్డుల ప్రదానోత్సవ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి, కేవీపీ రామచంద్ర రావు మధ్య ఉన్న అనుబంధం రాజకీయాలకు అతీతమైనదని, వారి బంధం సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వైఎస్ఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగించేందుకే కేవీపీ తరువాయి 2 వ పేజీలో...



### విశ్వవాణి



దక్షిణ మహాసముద్రంలోని మాక్వారీ ద్వీపంలో గత 45 ఏళ్లుగా వర్షపాతం గణనీయంగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. 1979 నుంచి 2023 వరకు నమోదైన రోజువారీ వాతావరణ సమాచారాన్ని ఆధునిక వాతావరణ పునర్నిర్మాణాలతో పోల్చి ఈ అధ్యయనం నిర్వహించారు. వర్షాలు పెరగడానికి తుఫాన్ల సంఖ్య పెరగడం కారణం కాదని పరిశోధకులు తేల్చారు. ఇప్పటికే ఉన్న తుఫాన్లే గతంతో పోలిస్తే ఎక్కువ వర్షాన్ని కురిపిస్తున్నాయని గుర్తించారు. తక్కువ అక్షాంశ ప్రాంతాల నుంచి వచ్చే వెచ్చని, అధిక తేమతో కూడిన గాలులు ప్రస్తుతం ఎక్కువగా తుఫాన్లతో కలిసి దక్షిణ దిశగా కదులుతున్నాయి. ఈ గాలుల్లో అధికంగా ఉన్న నీటి ఆవిరి వం-ర్షపాతాన్ని పెంచుతోంది.



## ఏపీ ప్రజలకు బీపీ, షుగర్

### పెరుగుతున్న కేసులు

### కొత్తగా 22 లక్షల కేసులు

### కొత్తగా 7673 క్యాన్సర్ కేసులు

విజయవాడ, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): ఏపీలో జీవనశైలి వ్యాధులు ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తున్నాయని వైద్యారోగ్య శాఖ తాజా సర్వే వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భారీ సర్వేలో కొత్తగా 11.79 లక్షల బీపీ (రక్తపోటు), 10.72 లక్షల తరువాయి 2 వ పేజీలో...



## రామమందిర సీఈవోగా జితేంద్ర మిశ్రా!

### గతంలో ఎయిర్‌ఫోర్స్ వెస్టర్న్ కమాండ్ చీఫ్‌గా బాధ్యతలు

### మందిర భద్రతకు శాశ్వత కమిటీ ఏర్పాటు ప్రతిపాదన


అయోధ్య: అయోధ్య రామ మందిరం పరిపాలనకు తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జీతేంద్ర మిశ్రాను నియమించే అవకాశం ఉంది. 5 వేల మందికి పైగా దరఖాస్తుదారుల నుంచి ఆయన్ను ఎంపిక చేసినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భారత వైమానిక దళంలో పలు కీలక కమాండ్ బాధ్యతలు నిర్వహించిన జీతేంద్ర మిశ్రా.. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో-2 వ పేజీలో...

## 3000 మందికి ఉబర్ ఉద్వాసన

### సిబ్బందిలో 10 శాతం మందిపై వేటు

### కంపెనీ పునర్‌వ్యవస్థీకరణే కారణమన్న సీఈవో

న్యూఢిల్లీ: ప్రముఖ అంతర్జాతీయ క్యాబ్ సేవల దిగ్గజం 'ఉబర్ టెక్నాలజీస్' తన ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చింది. సంస్థ పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 3,300 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతానికి సమానం. ఈ మేరకు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అధికారిక సమాచారం అందించారు. సంస్థలో నిర్వహణ స్థాయిలను తగ్గించి, పనితీరును మరింత మెరుగుపరిచేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

3.9.2026

మేషం: వృత్తి, ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు. నూతన విషయాలు తెలుసుకుంటారు. సంఘంలో పరిచయాలు పెరుగుతాయి. అన్ని రంగాల వారికి ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. జీవిత భాగస్వామితో దైవదర్శనం చేసుకుంటారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వృషభం: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. నూతన పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలలో అనుకూల మార్పులు చోటు చేసుకుంటాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దైవదర్శనాలు చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి.

మిధునం: ఉద్యోగ యత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. అన్ని రంగాల వారికి ఒడిదుడుకులు తప్పవు. ఋణ ఒత్తిడి అధికమవుతుంది. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహపరుస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

కర్కాటకం: నూతన ఋణయత్నాలు అనుకూలించవు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. బంధువులతో స్వల్ప విభేదాలు తప్పవు. కొన్ని వ్యవహారాలలో అంచనాలు అందుకోవడంలో విఫలమవుతారు. వ్యాపార, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.

సింహం: ఉద్యోగాలలో మరింత ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. నూతన వ్యక్తుల పరిచయం ఆనందం కలిగిస్తుంది. కీలక సమయంలో సోదరుల నుండి సహాయం అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు చాలా కాలంగా వేచి చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

కన్య: వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. అనుకోని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థికంగా కొంత చికాకులు తప్పవు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

తుల: ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణిస్తాయి. అన్ని రంగాల వారికి నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. నిరుద్యోగులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయి.

వృశ్చికం: వ్యాపారాలు, ఉద్యోగాలు కొంత నిరాశ కలిగిస్తాయి. బంధు వర్గం వారితో విభేదాలు తప్పవు. వృధా ఖర్చులు పెరుగుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలసిరావు. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. చేపట్టిన పనులలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

ధనస్సు: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులు అనుగ్రహం కలుగుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది.

మకరం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగస్తులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు.

కుంభం: నిరుద్యోగుల యత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. చేపట్టిన పనులలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి. ధన పరంగా ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యటం మంచిది.

మీనం: వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు తప్పవు. ఉద్యోగస్తులు ఒక వ్యవహారంలో అధికారుల నుండి సమస్యలు ఎదుర్కొంటారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు చివరి నిమిషంలో వాయిదా పడతాయి.

# వైఎస్ యుగం రావాలె!

మొదటి పేజీ తరువాయి

లక్ష్యమని పేర్కొన్నారు. పదవిని కిరీటంగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్న నాయకులపై కూడా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నుంచి నాయకులను ఆహ్వానించడాన్ని తాము వ్యతిరేకించడం లేదని పేర్కొంటూనే.. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న అసలు కార్యకర్తలను పక్కనబెట్టి పార్టీని తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడతామంటే బాగుండదు అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి అధికారం రావడం కోసం 10 ఏళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అసలు కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌ను కొందరు తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు గుప్పించిన రాజగోపాల్‌రెడ్డి.. తాను ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీని ఎవరూ కబ్జా చేయలేరని తేల్చి చెప్పారు. మునుగోడులోనే కాకుండా తెలంగాణలోని అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. వారికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు. తాను ప్రజా సమస్యలపైనే పోరాడుతున్నానని, పదవుల కోసం కాదని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనకు రాజకీయ స్ఫూర్తి అని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో వైఎస్ఆర్‌కు ఇప్పటికీ లక్షలాది మంది అభిమానులు ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ ఆశయాల కోసం పనిచేస్తానని.. ఆయన పాలనలో పేదలకు అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తావిస్తూ.. మళ్లీ రాజశేఖర్‌రెడ్డి యుగం రావాలని ఆకాంక్షించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలన్నదే తన ఆలోచన అని చెప్పారు. ఇచ్చిన హామీల అమలు, అవినీతికి వ్యతిరేకంగా, పేదలకు అండగా ఉండేందుకు తాను పోరాడతానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

## ఏపీ ప్రజలకు బీపీ, షుగర్

మొదటి పేజీ తరువాయి



షుగర్ (మధుమేహం) కేసులను గుర్తించడం ఆందోళన కలిగిస్తోంది. వీటితో పాటు కొత్తగా 7,673 క్యాన్సర్ కేసులు కూడా బయటపడినట్లు అధికారులు తెలిపారు. ఈ గణాంకాలు రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 17న ప్రారంభమైన అసంక్రమిత వ్యాధుల సర్వే (ఎన్‌సీడీ) – 4.0లో భాగంగా ఈ గణాంకాలను సేకరించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.71 కోట్ల మందిని సర్వే చేయగా, వారిలో 18 ఏళ్లు నిండిన 2.82 కోట్ల మందికి (66.05%) వైద్య పరీక్షలు పూర్తి చేసినట్లు వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఈ సర్వేతో రాష్ట్రంలో మొత్తం బీపీ కేసుల సంఖ్య 59.29 లక్షలకు, షుగర్ కేసుల సంఖ్య 48.15 లక్షలకు చేరినట్లు స్పష్టమైంది. అంటే.. గుర్తించిన ప్రతి ఐదుగురిలో ఒకరికి కొత్తగా వ్యాధి నిర్ధారణ అయినట్లే. జిల్లావారీగా కేసులను పరిశీలిస్తే, బీపీ, షుగర్ వ్యాధుల్లో బాపట్ల జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. షుగర్ కేసుల్లో బాపట్ల జిల్లా 16.89 శాతంతో మొదటి స్థానంలో ఉండగా.. పశ్చిమ గోదావరి (15.89%), తూర్పు గోదావరి (15.23%), ప్రకాశం (15.19%), కృష్ణా (15.01%) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అదేవిధంగా, బీపీ కేసుల్లో కూడా బాపట్ల జిల్లా 19.65 శాతంతో మొదటి స్థానంలో కొనసాగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ (19.45%), పశ్చిమ గోదావరి (19.05%) జిల్లాలు ఆ తర్వాత ఉన్నాయి. అయితే, అత్యల్పంగా అసంక్రమిత వ్యాధుల కేసులు అల్లూరి సీతారామరాజు జిల్లాలో నమోదు కావడం గమనార్హం. ఈ జిల్లాలో బీపీ కేసులు కేవలం 5.63 శాతం, షుగర్ కేసులు 1.51 శాతంగా మాత్రమే నమోదయ్యాయి. గిరిజన ప్రాంతాల్లో జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఇందుకు కారణంగా భావిస్తున్నారు. షుగర్ కేసుల విషయంలో శ్రీ సత్యసాయి (6.56%), కర్నూలు (6.86%), పార్వతీపురం మన్యం (7.14%) జిల్లాలు కూడా తక్కువ కేసులతో మెరుగైన స్థానంలో ఉన్నాయి. ఈ సర్వే ఫలితాలు రాష్ట్రంలో జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి.

## 3000 మందికి ఉబర్ ఉద్వాసన

మొదటి పేజీ తరువాయి

సీఈవో వెల్లడించారు. ఇటీవలి కాలంలో అనవసరమైన విభాగాలు, అదనపు మేనేజ్‌మెంట్ స్థాయిలు పెరిగాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వాటి అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రైడ్ షేరింగ్, డెలివరీ, రోబోట్యాక్సీ వంటి కీలక వ్యాపార విభాగాల్లో పెట్టుబడులను సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ లేఆఫ్‌ల ప్రభావం 20 శాతం మంది మేనేజర్లతో పాటు, ఇతర స్థాయిల సిబ్బందిపై కూడా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఉద్యోగుల తొలగింపుతో పాటు, ఉబర్ తన రిమోట్ వర్క్ విధానానికి దాదాపు స్వస్తి పలికింది. భవిష్యత్తులో కేవలం ఒక శాతం మంది ఉద్యోగులకు మాత్రమే ఇంటి నుండి పనిచేసే అనుమతి ఉంటుందని, మిగిలిన వారంతా తప్పనిసరిగా కార్యాలయాల నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించింది. ఈ లేఆఫ్‌ల అనంతరం ఉబర్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 30 వేలకు పరిమితం కానుంది. తద్వారా సంస్థ సిబ్బంది సంఖ్య తిరిగి 2021 నాటి స్థాయికి చేరుకోనుంది.

## ..ముందు రేవంత్ పోవాలె!

మొదటి పేజీ తరువాయి

బహిరంగంగా విమర్శలు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా షోకాజ్ నోటీసులు ఇవ్వాలి. వారి వెనుక ఉండి నన్ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడించిన అసలు సూత్రధారులపై కూడా చర్యలు తీసుకోవాలి. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదు, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది’ అని పేర్కొన్నారు.

## వైఎస్ఆర్ రైతుబంధు

మొదటి పేజీ తరువాయి

ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. చారిత్రాత్మక పాదయాత్ర చేసి పేదల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారని, అధికారంలోకి రాగానే రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని గుర్తు చేశారు. దేశ తొలి ప్రధాని విద్య, సాగునీటి రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని రేవంత్ రెడ్డి తెలిపారు. నెహ్రూ హయాంలోనే దేశంలో ఎన్నో భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బలమైన పునాదులు పడ్డాయని పేర్కొన్నారు. పేదలు, రైతులు, గిరిజనుల జీవితాల్లో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీలు వెలుగులు నింపారని కొనియాడారు. రైతు పంటలకు సరైన మద్దతు ధర దక్కేలా ఇందిరా గాంధీ హయాంలో విప్లవాత్మక చర్యలు తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాల వల్లే నేడు దేశంలో పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026’కు



రాజ్ నాథ్ సింగ్ ను ముఖ్య అతిథిగా సీఎం ఆహ్వానించారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో భాగమైన డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని రాజ్‌నాథ్ దృష్టికి తీసుకెళుతూ.. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనంతరం పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రంలోని విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని, కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితర నేతలు ఈ భేటీలలో పాల్గొన్నారు.

## గ్రీన్ కార్డు కావాలంటే 179 ఏళ్లు ఆగాలి

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు లేదా ఉద్యోగ ఆధారిత ఇమ్మిగ్రెంట్ పిటిషన్ దాఖలు చేసిన భారతీయులకు ఈబీ–2 కేటగిరీలో గ్రీన్‌కార్డ్ రావడానికి 179 ఏళ్లు, ఈబీ–3లో 38 ఏళ్లు, ఈబీ–1లో 5 ఏళ్లు పట్టే అవకాశం ఉందని ఎన్ఎఫ్ఏపీ పేర్కొంది. అమెరికా చట్టాల ప్రకారం ప్రతి ఏడాది ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డులకు సుమారు 1.40 లక్షల పరిమితి ఉంది. ఇందులో ఉద్యోగితో పాటు అతడి కుటుంబ సభ్యులకూ గ్రీన్‌కార్డులు ఉంటాయి. మరోవైపు దేశాల వారీగా కూడా కోటా పరిమితులు ఉన్నాయి. జనాభా భారీగా ఉన్న భారత్ వంటి దేశాలకు చిన్న దేశాలతో సమానంగా పరిమిత సంఖ్యలో గ్రీన్‌కార్డులు లభిస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. చైనాకు చెందిన ఈబీ–2 దరఖాస్తుదారులకు సుమారు 25 ఏళ్ల నిరీక్షణ ఉండొచ్చని ఎన్ఎఫ్ఏపీ అంచనా వేసింది. చైనా ఈబీ–3 దరఖాస్తుదారులకు దాదాపు 7 ఏళ్ల సమయం పడొచ్చని తెలిపింది. భారతీయుల ఈబీ–2 క్యూ ఎలా పెరిగిందో గత గణాంకాలు కూడా చెబుతున్నాయి. 2016లో 47,601 మంది భారతీయుల ఈబీ–2 పిటిషన్లను యూఎస్‌సీఐఎస్ క్లియర్ చేసింది. కుటుంబ సభ్యులతో కలిపి ఇది దాదాపు 98,594 మందికి సమానం. అయితే ఆ ఏడాది కేవలం 4,407 మంది భారతీయులకే ఈబీ–2 శాశ్వత నివాసం లభించింది.

## 200 ఏళ్ల తర్వాత ఆడబిడ్డ పుట్టిందని..!

మొదటి పేజీ తరువాయి

గొప్ప అదృష్టమని, ఇన్నాళ్లుగా తమ వంశంలో ఆడపిల్ల లేదన్న వెలితి తీరిపోయిందని అన్నారు. “సాధారణంగా చాలామంది కుమారుడు జన్మించాలని కోరుకుంటారు. కానీ ఆడపిల్ల పుడితే కలిగే అనుభూతే వేరు. తండ్రులకు కూతుళ్లంటే అమితమైన ప్రేమ. మా పాపను కంటికి రెప్పలా చూసుకుంటాం” అని గర్గి తండ్రి తన భావోద్వేగాన్ని పంచుకున్నారు.

## 5 వరకు రేషన్ బియ్యం పంపిణీ

మొదటి పేజీ తరువాయి

కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఆగస్ట్ 1వ తేదీన ప్రారంభమైంది. తొలుత ఆగస్ట్ 31వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయాలని అధికారులు



షెడ్యూల్ రూపొందించారు. ఒకేసారి 3 నెలల కోటా పంపిణీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరిగింది. దీంతో కొందరు కార్డుదారులు తమకు కేటాయించిన కోటాను నిర్ణీత సమయంలో తీసుకోలేకపోయారు. మరోవైపు.. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లారు. దీంతో రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తీసుకునే అవకాశం చాలామందికి లేకుండా పోయింది. చివరి రోజుల్లో రేషన్ షాపుల వద్ద రద్దీ కూడా పెరగడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగలేదు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న పౌరసరఫరాల శాఖ.. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మూడు నెలల బియ్యం కోటాను కోల్పోకూడదనే ఉద్దేశంతో గడువును పొడిగించింది. తాజాగా పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం వరకు రేషన్ దుకాణాల్లో 3 నెలల బియ్యం కోటాను తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు రేషన్ సరుకులు తీసుకోని అర్హులైన కార్డుదారులు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# రామమందిర సీఈవోగా జితేంద్ర మిశ్రా!

మొదటి పేజీ తరువాయి

వెస్ట్రన్ కమాండ్ చీఫ్‌గా పనిచేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ భేటీలో 12 అంశాలపై చర్చించనున్నారు. ఇందులో రామ మందిరానికి తొలి సీఈఓ నియామకం ప్రధాన అంశంగా ఉంది. సీఈఓకు విస్తృత పరిపాలనా అధికారాలు కల్పించేలా ట్రస్ట్ డీడ్‌లో మార్పులు చేయాలని కూడా నిర్ణయించే అవకాశం ఉంది. 2020 ఫిబ్రవరి 5న ట్రస్ట్ ఏర్పాటైన తర్వాత డీడ్‌లో మార్పులు చేయడం ఇదే తొలిసారి కానుంది. మందిరంలో విరాళాల అక్రమాల ఆరోపణలు, సమర్పణల నగదు మాయం వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ట్రస్ట్ నిర్వహిస్తున్న మూడో సమావేశం ఇది. ఈ వ్యవహారం నేపథ్యంలో ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేశారు. మందిరం పరిపాలనను మరింత ప్రొఫెషనల్‌గా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సీఈఓ అవసరమని రామ మందిర నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలో పేర్కొన్నారు. సీఈఓ ప్రభుత్వ జోక్యం లేకుండా పనిచేస్తారని, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శికి నివేదిస్తారని సమాచారం. సీఈఓకు చట్టపరమైన, పరిపాలనా, ఆర్థిక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సంస్థకు అవసరమైన విధానాలు, వ్యవస్థలు, నిర్వహణ పద్ధతులను రూపొందించడం, ట్రస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, చట్టపరమైన నిబంధనలను పాటించేలా చూడటం వంటి బాధ్యతలు కూడా ఆయన పరిధిలోకి రానున్నాయి. సంస్థ భవిష్యత్ అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణలో సీఈఓ అత్యున్నత కార్యనిర్వాహక అధికారిగా వ్యవహరించనున్నారు. మందిర భద్రత కోసం శాశ్వత స్థానిక భద్రతా సమన్వయ కమిటీ ఏర్పాటు అంశం కూడా సమావేశం అజెండాలో ఉంది. ట్రస్ట్‌కు అధికారిక మీడియా ప్రతినిధిని నియమించే అంశంపైనా చర్చించనున్నారు. విరాళాల అక్రమాల ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పురోగతిని కూడా ట్రస్ట్ సమీక్షించనుంది. ఈ కేసుకు సంబంధించిన సుప్రీంకోర్టు విచారణ స్థితిపైనా చర్చ జరగనుంది. విరాళాల అక్రమాల ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేసిన మరుసటి రోజు, జూన్ 26న చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేశారు. తొలి సీఈఓ నియామకం, ట్రస్ట్ డీడ్‌లో మార్పులతో రామ మందిర పరిపాలనలో కొత్త విధానాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది.

**ముగ్గురు కొత్త సభ్యుల నియామకం**

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బుధవారం నిర్వహించిన సమావేశంలో ట్రస్టుకు ముగ్గురు కొత్త సభ్యులను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా, ఆలయ నిర్వహణ కోసం తొలిసారిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నియామకాన్ని కూడా త్వరలోనే పూర్తి చేయనున్నారు. నూతనంగా నియమితులైన సభ్యుల్లో ఢిల్లీకి చెందిన మహేశ్ భగచంద్కా, అయోధ్యకు చెందిన మదన్ మోహన్ పాండే, షికోహాబాద్ వాసి నిర్మలా యాదవ్ ఉన్నారు. వీరిలో మహేశ్ భగచంద్కా, దివంగత విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అగ్రనేత అశోక్ సింఘాల్‌కు సమీప బంధువు కావడం గమనార్హం. ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామా చేయడం, మరో సభ్యుడు విమలేంద్ర మోహన్ మిశ్రా కన్నుమూయడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఆరంభంలో ఆలయ విరాళాల నిర్వహణలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు ట్రస్టు పునర్వ్యవస్థీకరణకు పూనుకుంది. ఇందులో భాగంగానే ఈ తాజా నియామకాలు జరిగాయి. ఆలయ దైనందిన కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలను మరింత వృత్తిపరంగా నిర్వహించేందుకు తొలిసారిగా సీఈఓ పదవిని అందుబాటులోకి తెచ్చారు. ఈ పోస్టుకు సుమారు 5,500కు పైగా దరఖాస్తులు రాగా, త్రిసభ్య ఎంపిక కమిటీ ముగ్గురి పేర్లను ట్రస్టుకు సిఫార్సు చేసింది. వీరిలో ఒకరిని సీఈఓగా ఎంపిక చేసే ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది. బహుశా సెప్టెంబరు 3వ తేదీన సీఈఓ పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.





# ఉత్తరాంధ్ర బీళ్లకు గోదారి జలాలు

**పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి విడుదల**

అనకాపల్లి, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు పులకించిపోయారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. బుధవారం పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్టు వివరించారు. "2019లో వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసింది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాప విముక్తి కలిగించారు" అని చంద్రబాబు విమర్శించారు. ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం ఉన్నాయని కొనియాడారు. "గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సభా వేదిక నుంచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం, ప్రాజెక్టు కోసం కృషి చేసిన ఇంజినీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.










## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## ఎటు చూసినా విధ్వంసం, వికృతమే

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## ప్రజా వ్యతిరేకతే రేవంత్ సర్కారు ఘనత: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు. గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు.

## వైఎస్‌కు మరణం లేదు: వినయ్ ముదిరాజ్

ఫతేనగర్, ఆగస్టు 2 (ఈ వార్తలు): మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఫతేనగర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్ ముదిరాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజల సంక్షేమాన్నే పరమావధిగా భావించి పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులు, వితంతువుల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత అని కొనియాడారు. ప్రజల కోసం నిరంతరం పరితపించిన రాజన్నకు మరణం లేదని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ బకాయిలను రద్దు చేసి వ్యవసాయ రంగానికి వైఎస్సార్ కొత్త ఊపిరి పోశారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల జీవితాల్లో ఆయన సేవలకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గం, పాలనా విధానం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రోటోకాల్ కమిటీ కోఆర్డినేషన్ సెక్రటరీ సూరజ్ తివారి, మాజీ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు క్రాంతి, వెల్డింగ్ నర్సింగ్, అరుణ్, కిట్టు, అహ్మద్, నవ్వేథ్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ఘనంగా పవన్ కల్యాణ్ బర్త్‌డే

**ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయి దుర్గా తేజ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ సినీ నటుడు, పవన్ మేనల్లుడు సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అభిమానులు, జనసేన కార్యకర్తల మధ్య ఆయన ఈ సంబరాల్లో పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గోపాల్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి దుర్గా తేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులతో కలిసి ఆయన పుట్టినరోజు కేక్ కట్ చేశారు. అనంతరం పవన్ కల్యాణ్‌కు తన హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో అభిమానులు, జనసేన మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఫతేనగర్ సమస్యలపై ఈటలకు వినతి

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 2 (ఈ వార్తలు): ఫతేనగర్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ తీసుకెళ్లారు. ఫతేనగర్‌లో పర్యటించిన ఎంపీకి స్థానిక సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా చాలాకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బ్రిడ్జి సమస్యను ఆయన ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వంతెన సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్ కూడా సమస్య తీవ్రతను ఎంపీకి వివరించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరారు. స్థానికుల సమస్యలను విన్న ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కాంచి మహేందర్‌తో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ పాత విమానాశ్రయ ప్రాంతంలోని శ్మశానవాటికను సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్మశానవాటిక అభివృద్ధికి కొన్ని పనులు ప్రారంభమైనప్పటికీ అవి పూర్తికాకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రాలేదని కాంచి మహేందర్ తెలిపారు. మిగిలిపోయిన పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీని కోరారు. ఈ పర్యటనలో బీజేపీ నాయకులు, ఫతేనగర్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**420 అడుగుల హామీల ఫ్లెక్సీతో బీఆర్ఎస్ రోడ్ ప్రదర్శన**

**కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా**

కోరుట్ల, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నాయకులు తీవ్రంగా విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ప్రతీకగా 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, కోరుట్ల బస్‌స్టాండ్ అంబేద్కర్ చౌరస్తా నుంచి రోడ్ ప్రదర్శన నిర్వహించారు. ఫ్లెక్సీపై కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలను ప్రదర్శిస్తూ.. వాటిలో ఎన్ని అమలయ్యాయి, ఇంకా ఎన్ని నెరవేరాల్సి ఉందనే వివరాలను ప్రజలకు తెలియజేసేలా ప్రదర్శన చేపట్టారు. భారీ ఫ్లెక్సీతో నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచినా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించేందుకే ఈ పోరాటం చేపట్టామని తెలిపారు. ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం నిర్వహించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీ రోడ్ ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మున్సిపల్ వాహనాల నుంచి పెట్రోల్ చోరీ

**83 లీటర్ల పెట్రోల్ అపహరణ.. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లపై కేసు**

జగిత్యాల, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ వాహనాల నుంచి పెట్రోల్ చోరీ చేస్తున్న ఇద్దరు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లపై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన దోరనాల కిరణ్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ వాహనాల్లో కొంతకాలంగా పెట్రోల్ తగ్గుతున్నట్లు గుర్తించిన కిరణ్ నిఘా పెట్టారు. ఈ క్రమంలో బుధవారం విద్యానగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో పార్క్ చేసిన మున్సిపల్ వాహనాల నుంచి పెట్రోల్ తీస్తున్న ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు బొమ్మన అనిల్‌కుమార్, కట్కూరి నాగరాజులను పట్టుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని ప్రశ్నించగా గతంలో కూడా మున్సిపల్ వాహనాల నుంచి పెట్రోల్ చోరీ చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 83 లీటర్ల పెట్రోల్, సుమారు రూ.10 వేల విలువైనది చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై జి.మహేశ్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయాన్ని జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు.




## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**100 రోజుల్లో అమలు చేస్తామన్నారు.. వెయ్యి రోజులు దాటినా జాడేది?**

**ధర్మపురిలో బీఆర్ఎస్ ర్యాలీ, ధర్నా.. పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

ధర్మపురి, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. బుధవారం ధర్మపురిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అమలు కాని హామీల ఫ్లెక్సీతో అభయ ఆంజనేయస్వామి విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ధర్మపురి, బుగ్గారం, పెగడపల్లి, గొల్లపల్లి, ఎండపల్లి, ధర్మారం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ.. మహిళలకు రూ.2,500 సాయం, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ.4 వేల పింఛన్, యువతకు ఉద్యోగాలు వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని అన్నారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో పోలీసు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, అయ్యోరి రాజేష్, బండారి రంజిత్, సంగి సత్యమ్మ, ఓడ్నాల మల్లేశం, చిలివేరి శ్యామ్, సంగి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత లేని వైద్యుడితో సేవలా..?

**మెట్‌పల్లిలో ప్రైవేట్ ఆస్పత్రులపై ఆకస్మిక తనిఖీలు**

మెట్‌పల్లి, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డా. ముస్కు జైపాల్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సూర్య ఆస్పత్రిలో అర్హత లేని వైద్యుడితో ఈఎన్‌టీ సేవలు అందిస్తున్నారనే ఫిర్యాదులపై తనిఖీ చేపట్టారు. వైద్యుల విద్యార్హతలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, ఆస్పత్రి రికార్డులను పరిశీలించి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నిబంధనల ప్రకారం వివరణ అనంతరం చర్యలు తీసుకుంటామని జైపాల్ రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన, నమోదిత వైద్యులతోనే సేవలు అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వైద్యాధికారి డా. అంజిత్ రెడ్డి పాల్గొన్నారు.




## ఆరు గ్యారెంటీలు అమలు చేయాల్సిందే!

**గంగాధరలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

గంగాధర, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గంగాధర మండల కేంద్రంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపైకి చేరుకుని భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. అబద్ధపు ప్రచారం, తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు.ఆరు గ్యారెంటీల అమలును డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం చుట్టూ భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహించారు. ఫ్లెక్సీ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మద్దతు తెలిపారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధిక చక్కెరతో చిక్కులు

**ఆధునిక జీవన శైలితో ఊబకాయం, మధుమేహం**

**బాల్యం నుంచి ఆరోగ్యకర ఆహార అలవాట్లు అవసరం**

**ఐసీఎంఆర్- ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి**




హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): చిన్నతనం నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి సూచించారు. రెండు సంవత్సరాల్లోపు పిల్లలకు అదనపు చక్కెర ఇవ్వకూడదని మార్గదర్శకాలు సూచిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ ప్రెస్ టూర్‌లో భాగంగా ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది సభ్యుల మీడియా ప్రతినిధి బృందం బుధవారం ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌ను సందర్శించింది. పోషకాహార పరిశోధన, ప్రజారోగ్య అవగాహన, జాతీయ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న శాస్త్రీయ సమాచారంపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. డాక్టర్ భారతి కులకర్ణి మాట్లాడుతూ ఆహార కూర్పు, పోషక అవసరాలు, ఆహార మార్గదర్శకాలపై శాస్త్రీయ ఆధారాలను రూపొందించడంలో సంస్థ కీలకంగా పనిచేస్తోందన్నారు. దేశీయ ఆహార పదార్థాల్లోని శక్తి, ప్రోటీన్, సూక్ష్మపోషకాలు, ఖనిజాల వివరాలను అందించే ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ పరిశోధకులు, ఆహార పరిశ్రమ, ప్రజారోగ్య విధాన రూపకర్తలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. వివిధ వయస్సులు, శారీరక వర్గాలకు అవసరమైన పోషక స్థాయిలను నిర్దేశించే సిఫార్సు చేసిన ఆహార భత్యాలు (ఆర్‌డీఏ) ప్రాధాన్యతను వివరించారు. భారతీయుల కోసం ఆహార మార్గదర్శకాల్లోని కీలక అంశాలను ప్రస్తావిస్తూ చిన్న వయస్సు నుంచే సమతుల్యమైన ఆహారపు అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. పోషకాహార లోపంతో పాటు ఆధునిక జీవనశైలిలో కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవడం వల్ల పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఆహారం అందుబాటులో ఉండటం మాత్రమే పోషకాహార భద్రతకు హామీ ఇవ్వదని, ఆహార వైవిధ్యం, ప్రవర్తనా మార్పు కూడా అవసరమని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని మండువా, ఝంగోరా, చోళై, కోడా వంటి దేశీయ పంటలు, చిరుధాన్యాల పోషక విలువలపై పరిశోధనలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాగి వినియోగం రక్తహీనత తగ్గింపుపై చూపే ప్రభావాన్ని అంచనా వేసే వైద్య, విశ్లేషణాత్మక అధ్యయనాలు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ పోషకాహార సమాచారం, కమ్యూనికేషన్-ఆరోగ్య విద్య విభాగం అధిపతి, శాస్త్రవేత్త-జి డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు ఆధ్వర్యంలో సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. పోషకాహార లోపాలు, సూక్ష్మపోషకాల లోపాలు, జీవనశైలి ఆధారిత జీవక్రియ రుగ్మతల మధ్య సంబంధాన్ని ఆయన వివరించారు. శాస్త్రీయ పోషకాహార సమాచారాన్ని ప్రజల రోజువారీ ఆహారపు అలవాట్లతో అనుసంధానించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కోరారు. ఆధారాలతో కూడిన ఆహార పద్ధతులను ప్రోత్సహించేలా బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ చేయాలని సూచించారు. అనంతరం మీడియా ప్రతినిధులు ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌లోని అధునాతన ప్రయోగశాలలను సందర్శించి ఆహార విశ్లేషణ, లిపిడ్ కెమిస్ట్రీలో జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. అనంతరం సాలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించారు.

# రేవంత్‌ను గద్దె దించేదాకా పోరు

**మాజీమంత్రి జీవన్ రెడ్డి శపథం**

**జగిత్యాలలో 420 హామీల వైఫల్యంపై బీఆర్ఎస్ ర్యాలీ**



జగిత్యాల, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రజా పాలన కాదు ప్రజా వంచన పాలన నడుస్తోందని, ఇది ఆరంభం మాత్రమే, రేవంత్ రెడ్డి గద్దె దిగే వరకు పోరాటం ఆగదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల వైఫల్యాలను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జగిత్యాల కొత్త బస్టాండ్ లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో, ప్రభుత్వ వైఫల్యాల ప్లకార్డులతో, బీఆర్ఎస్ జెండాలతో ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరిగిన సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్ద కాలం కేసీఆర్ తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారని, వెయ్యి రోజులైనా ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని విమర్శించారు. రైతు బీమా, రైతు భరోసా, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ వంటి పథకాలను కాంగ్రెస్ నిర్వీర్యం చేసిందని, బెల్ట్ షాపులు పెంచి ఎక్సైజ్ ఆదాయాన్ని 18 వేల కోట్ల నుండి 36 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4000 పెన్షన్, ఆటో కార్మికులకు నెలకు రూ.1000, రైతు కూలీలకు రూ.12 వేలు, రాజీవ్ యువ వికాసం, ఫీజు రీయింబర్స్ మెంట్, బీసీ సబ్ ప్లాన్ నిధులు ఏవీ ఇవ్వలేదన్నారు. ఉద్యమాల గడ్డ జగిత్యాల నుండే రేవంత్ పతనం ప్రారంభమవుతుందని, కేసీఆర్ రావాలి - రేవంత్ పోవాలి అనే నినాదంతో పోరాడుతామన్నారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ కేసీఆర్ కిట్ లాంటి పథకాలను కాంగ్రెస్ పేరు మార్చి అయినా కొనసాగించాలని అన్నారు. అనంతరం దావ వసంత సురేష్ మాట్లాడుతూ 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు దాటినా అమలు చేయలేదని, కళ్యాణ లక్ష్మికి తులం బంగారం, విద్యా భరోసా కింద రూ.5 లక్షలు ఇవ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి దేవేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ శీలం ప్రవీణ్ ప్రియాంక, చల్ గల్ సర్పంచ్ జున్ను రాజేందర్, సుధాకర్, దుర్గయ్య, మల్లేశం, ముఖసిరలి నిహాల్, ఆసిన్ సావన్, ఇర్షాద్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాలే మన లక్ష్యం: ఆది శ్రీనివాస్




వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ పనిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు మండుటెండల్లో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు తొలి సంతకం చేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, జలయజ్ఞం ద్వారా అనేక సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేసి, పలు రిజర్వాయర్లు, కాలువల నిర్మాణానికి మార్గం సుగమం చేశారని గుర్తుచేశారు. 2006లో వేములవాడ నియోజకవర్గంలోని మల్యాల వద్ద జరిగిన ఇందిరమ్మ గ్రామసభకు వైఎస్సార్ హాజరై ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎల్ఎండీ ప్రాజెక్టు ద్వారా వరద కాలువ నీటిని మళ్లించి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అప్పుడే ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని, పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కూడా వైఎస్సార్ హయాంలో నిధులు కేటాయించారని గుర్తుచేశారు. వైఎస్సార్ మరణం కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు తీరని లోటని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి కొనసాగిస్తూ సాగునీటి రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




గంగాధర, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణలో పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోందని పేర్కొన్నారు. బుధవారం గంగాధర ప్రజా కార్యాలయంలో గంగాధర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఆచంపల్లిలో 4, చిన్న ఆచంపల్లిలో 1, బూరుగుపల్లిలో 1, చర్లపల్లి (ఎన్)లో 1, నారాయణపూర్‌లో 4, లింగంపల్లిలో 1, గంగాధరలో 2, మధురనగర్‌లో 3, ర్యాలపల్లిలో 3, గర్శకుర్తిలో 5, ఉప్పరమల్యాలలో 3, లక్ష్మిదేవిపల్లిలో 2 ఇళ్లకు మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేసి ఇళ్లు లేని అర్హులకు అందిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లు మంజూరు కాని నిరుపేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ దశలవారీగా ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదల కోసం ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని ఎమ్మెల్యే విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు ముద్దం నగేష్, పలువురు సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జనసేన ఆధ్వర్యంలో పవన్ బర్త్ డే సెలబ్రేషన్స్

గంగాధర, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురనగర్ చౌరస్తాలో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన సీనియర్ నాయకుడు మొగిలిపాలెం రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన వీరమహిళ భారతి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. దేశరాజుపల్లి అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేదలు, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో జనసేన పార్టీ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో చొప్పదండి సీనియర్ నాయకుడు గొంటి సంజీవ్‌కుమార్, మల్యాల మండల నాయకులు దూడం శ్రీనాథ్, కనకట్ల శ్రీనివాస్, జక్కని అఖిల్, జుంగవేణి రాజు, గంగాధర చంద్రయ్య, అరవింద్, మానేరు జగదీశ్, రెడ్డి సాయి, అడ్డగుట్ట చందు, సోన్నాకుల వెంకటేష్, ముస్కు అనేందర్, ముకుందు, మధు తదితర జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



## రేపు కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ నగర తొలి మేయర్, పత్రికా సంపాదకుడు, సంఘ సంస్కర్త కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలను సెప్టెంబర్ 4న నిర్వహించనున్నట్లు కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు జి. దివాకర్ ముదిరాజ్ తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో నిర్వహించనున్న ఈ వేడుకలకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ కార్పొరేషన్ సలహాదారుడు వి. హనుమంతరావు, ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ హాజరుకానున్నట్లు చెప్పారు. మీడియా సమావేశంలో కృష్ణమూర్తి, మన్మోహన్, సురేందర్ వెంకట్రావు, మంద శ్రీనివాస్, ఆంజనేయులు, నీలం శ్రీనివాస్, నరేష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



## వేములవాడలో ఘనంగా జనసేనాని బర్త్ డే

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను వేములవాడ జనసేన ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ బండారి రాజ్‌కుమార్, డాక్టర్ సాయి కృష్ణప్రియ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని రాజన్నను ప్రార్థించినట్లు బండారి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న క్షేత్రానికి పవన్ కల్యాణ్ త్వరలో రావాలని కోరుకుంటున్నామని అన్నారు. ఆయన వేములవాడ పర్యటన జరిగేలా ప్రయత్నిస్తామని, ఘన స్వాగతం పలికేందుకు వేములవాడ జనసేన కుటుంబం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. డాక్టర్ సాయి కృష్ణప్రియ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆశయాలు యువతతో పాటు మహిళలను కూడా ప్రజాసేవ వైపు నడిపిస్తున్నాయని అన్నారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ ఆరోగ్యంగా, విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేములవాడ జనసైనికులు నరేష్, రోహిత్, పవన్, సాదులతో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

జగిత్యాల, సెప్టెంబర్ 2 (ఈవార్తలు): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పాదయాత్రలో రైతుల సమస్యలను తెలుసుకుని అధికారంలోకి వచ్చిన అనంతరం రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. జగిత్యాలలో ఇందిరమ్మ కాలనీని 2008లో వైఎస్సార్ మంజూరు చేశారని తెలిపారు. కాలనీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2024లో రూ.36 కోట్లు మంజూరు చేసిందన్నారు.

# భారత్‌కు నేపాల్ ప్రధాని ధన్యవాదాలు

**నేపాల్ పార్లమెంట్‌లో బాలేన్ షా ప్రశంసలు**

ఖట్మండు: నేపాల్‌లో భారీ వరదలు, కొండచరియల విరిగిపడటంతో తీవ్ర నష్టం జరిగిన వేళ భారత్ అందించిన సకాల సాయంపై ఆ దేశ ప్రధాని బాలేన్ షా ప్రశంసలు కురిపించారు. భారత్, చైనా సకాలంలో సహాయక చర్యలకు మద్దతు ఇచ్చాయని నేపాల్ పార్లమెంట్‌లో తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయ సాయం తిరస్కరించే ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేశారు. వరదల ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారత్, చైనా తమ సాంకేతిక నిపుణులను పంపాయని బాలేన్ షా చెప్పారు. విపత్తు సంభవించిన తొలిరోజు నుంచే నష్టాన్ని అంచనా వేసేందుకు వైమానిక పరిశీలనతో పాటు ఇతర మార్గాల్లో పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే భారత సాంకేతిక నిపుణులు మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకున్నారని పేర్కొన్నారు. వరదల ప్రాంతాల్లో బురద, మట్టి భారీగా పేరుకుపోవడంతో సహాయక చర్యలు అత్యంత కష్టంగా మారాయని బాలేన్ షా వివరించారు. ఎక్స్కవేటర్లు మాత్రమే కాదు.. సైన్యం, సాయుధ పోలీసు సిబ్బంది కూడా నిలబడేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. నేపాల్‌లోని భోటేకోషి నది ఉప్పొంగడంతో రసువా ప్రాంతాన్ని భారీ వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తుకు వాతావరణ మార్పులే కారణమని బాలేన్ షా ఇటీవల పేర్కొన్నారు. ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రపంచ స్థాయిలో సమన్వయంతో కూడిన విపత్తు నిర్వహణ వ్యవస్థ అవసరమని పిలుపునిచ్చారు. నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య బుధవారం నాటికి 1,127కి చేరింది. వేలాది మంది గల్లంతైన నేపథ్యంలో సహాయక బృందాలు వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్ భద్రతా బలగాలు 6,541 మందిని ప్రభావిత ప్రాంతాల నుంచి రక్షించాయి. మరో 4,858 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. భారత్ భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. ప్రత్యేక టన్నెల్ రెస్క్యూ బృందాలు, వైద్య బృందాలు, డీఎన్ఏ ఆధారంగా మృతులను గుర్తించే ఫోరెన్సిక్



నిపుణులను నేపాల్‌కు పంపింది. బాధితులను రక్షించేందుకు భారత్ నుంచి ఇప్పటివరకు కనీసం 163 మందిని తరలించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. అత్యవసర సహాయక సామగ్రిలో భాగంగా భారత్ నాలుగు విడతల్లో తాత్కాలిక షెల్టర్లు, దుప్పట్లు, హైజీన్ కిట్లు, సోలార్ లైట్లు, మందులు పంపింది. 70 టన్నులకు పైగా దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ షీట్లు, హైజీన్ కిట్లను విమానాల ద్వారా నేపాల్‌కు తరలించింది. బాధితుల సహాయక చర్యల కోసం భారత విదేశాంగ శాఖతో పాటు ఖాట్మండు, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు.

## జెమిని 3.8 ఫ్లాష్ సైబర్ విడుదల

**భద్రతా లోపాలను గుర్తించి సరిచేయగల సామర్థ్యం**

న్యూయార్క్: టెక్ దిగ్గజం గూగుల్ సైబర్ సెక్యూరిటీ రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. తమ అత్యంత శక్తివంతమైన సైబర్ సెక్యూరిటీ ఏఐ మోడల్ "జెమినీ 3.8 ఫ్లాష్ సైబర్"ను పరిచయం చేస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. సైబర్ భద్రతకు సంబంధించిన లోపాలను అత్యంత వేగంగా గుర్తించి, వాటిని అంతే వేగంగా సరిదిద్దడంలో ఈ మోడల్ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఏఐ మోడల్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహించిన పరిశ్రమల ప్రామాణిక 'సైబర్‌జిమ్' బెంచ్‌మార్క్‌లో ఇది 86.2 శాతం స్కోరును సాధించిందని ఆయన తెలిపారు. అదేవిధంగా, లోపాలను సరిచేసే విషయంలో 'సీడబ్ల్యూఈ–బెంచ్' పరీక్షలో 47.2 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. గూగుల్ అందిస్తున్న ఇతర ఫ్లాష్ మోడల్స్ తరహాలోనే ఇది కూడా వేగవంతమైన పనితీరును, తక్కువ ఖర్చుతో కూడిన లభ్యతను కలిగి ఉంటుందని సుందర్ పిచాయ్ వివరించారు. గూగుల్ నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో దాదాపు 20 ప్రోగ్రామింగ్ భాషల్లోని లోపాలను కనుగొనడంలో ఈ మోడల్ 70 శాతం కంటే ఎక్కువ సక్సెస్ రేటును నమోదు చేసినట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. అత్యున్నత స్థాయి పనితీరును కనబరుస్తూనే, "ఫ్లాష్" స్థాయి వేగంతో, సరసమైన ధరకే ఈ మోడల్ అందుబాటులోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## భారీగా పెరిగిన గెలాక్సీ ఫోన్ల ధరలు

**గెలాక్సీ ఏ17 టాప్ వేరియంట్‌పై ఏకంగా రూ. 14,500 పెంపు**



ముంబై: పండుగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకుంటున్న వినియోగదారులకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఊహించని షాక్ ఇచ్చింది. భారత్‌లో ఎంపిక చేసిన గెలాక్సీ ఏ–సిరీస్, ఎఫ్–సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ధరలను కంపెనీ భారీగా పెంచింది. సవరించిన ఈ ధరలు 2026 సెప్టెంబర్ 2వ తేదీ నుంచి తక్షణమే అమలులోకి వచ్చాయి. మెమరీ చిప్‌ల వ్యయం పెరగడమే ఈ ధరల పెంపునకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ధరల పెంపు ప్రభావం గెలాక్సీ ఏ17 మోడల్‌పై అత్యధికంగా కనిపిస్తోంది. దీని 8జీబీం256జీబీ టాప్ వేరియంట్ ధర రూ. 23,999 నుంచి ఏకంగా రూ. 38,499కి పెరిగింది. అంటే, ఒక్క మోడల్‌పైనే సుమారు రూ. 14,500 మేర ధర పెరిగింది. ఇదే మోడల్‌లోని 6జీబీ, 8జీబీ (128జీబీ స్టోరేజ్) వేరియంట్లపై రూ. 3,500 పెంచారు. దీంతో వాటి ప్రారంభ ధర రూ. 27,999గా నిర్ణయించబడింది. ఇక ఇతర మోడళ్ల విషయానికొస్తే, గెలాక్సీ ఏ27పై వేరియంట్‌ను బట్టి రూ. 5,000 వరకు ధర పెరిగింది. గెలాక్సీ ఏ07పై రూ. 2,000, గెలాక్సీ ఎఫ్17పై రూ. 3,500 చొప్పున ధరలను సవరించారు. పండుగ ఆఫర్ల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో శాంసంగ్ తీసుకున్న ఈ నిర్ణయం వినియోగదారులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. సాధారణంగా డిస్కౌంట్లు ఆశించే సమయంలో ఇలా ధరలు పెరగడం ఇప్పుడు మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది.

## సోనియా.. సీతాదేవి లెక్క

**వారిద్దరి త్యాగాలు ఒక్కటే.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్**

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రామాయణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాముడి కంటే సీతాదేవి పాత్ర ఎంతో గొప్పదని, ఆమె చేసిన త్యాగాలు, ఎదుర్కొన్న కష్టాలు మహిళలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. బుధవారం బెంగళూరులో మహిళా పారిశ్రామికవేత్తల సంఘం నిర్వహించిన 'టుగెదర్ వియ్ గ్రో' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీని ఆయన ఉదాహరణగా చూపారు. ఇందిరా గాంధీ మరణం, భర్త రాజీవ్ గాంధీ హత్య వంటి ఎన్నో విషాదాలను ఎదుర్కొని ఆమె పార్టీని నడిపించారని గుర్తుచేశారు. రెండుసార్లు ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌కు ఆ పదవిని ఇచ్చారని, ఇది మహిళల త్యాగనిరతికి నిదర్శనమని చెప్పారు. సవాళ్లను అధిగమించి వ్యాపారాలు నిర్మించిన మహిళా పారిశ్రామికవేత్తలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. గ్రామ పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు మహిళల నాయకత్వం అవసరమని డీకే శివకుమార్ అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 'శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 'గృహలక్ష్మి' పథకం కింద 1.22 కోట్ల మంది మహిళలకు నెలకు రూ. 2,000 అందిస్తున్నామని వివరించారు. అనంతరం బెంగళూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతిపాదించిన టన్నెల్ రోడ్డు ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. రాజకీయ కారణాలతో కొందరు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని, పారిశ్రామికవేత్తలుగా దీనికి మద్దతుగా గళం విప్పాలని కోరారు. కష్టపడి పనిచేస్తే ఫలితం తప్పక ఉంటుందని, మహిళా పారిశ్రామికవేత్తలు ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని సూచించారు. కర్ణాటక అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఏడాదిలో 40% పెరిగిన గుడ్డు రేటు

**కోడి దాణా మొక్కజొన్నను ఇథనాల్ తయారీకి తరలించడమే ప్రధాన కారణం**



న్యూఢిల్లీ: దేశంలో కోడిగుడ్ల ధరలు సామాన్యులకు భారాన్ని కలిగిస్తున్నాయి. గత ఏడాది కాలంలో గుడ్ల ధరలు ఏకంగా 35 నుంచి 40 శాతం వరకు పెరిగాయని నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) వెల్లడించింది. ఇటీవలి వరకు ఫామ్ వద్దే ఒక్కో గుడ్డు ధర రూ. 7 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో అది రూ. 8 నుంచి రూ. 9కి చేరింది. రాబోయే శీతాకాలంలో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉండటంతో, ధరలు ఇంకా పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈ20' ఇంధన విధానమే ప్రధాన కారణమని తెలుస్తోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపాలన్న లక్ష్యంతో మొక్కజొన్నను భారీగా వినియోగిస్తున్నారు. కోళ్ల దాణా తయారీ వ్యయంలో 65 నుంచి 70 శాతం మొక్కజొన్నదే కావడం గమనార్హం. దేశీయంగా ఉత్పత్తవుతున్న మొక్కజొన్నలో దాదాపు 37 శాతాన్ని ఇథనాల్ తయారీ పరిశ్రమలకే మళ్లించడంతో, కోళ్ల పరిశ్రమకు దాణా కొరత ఏర్పడి ధరలు గణనీయంగా పెరిగాయి. గత మూడేళ్ల కాలంలో టన్ను మొక్కజొన్న ధర రూ. 14,000 నుంచి రూ. 26,500కి పెరిగింది. ముఖ్యంగా గత ఐదు నెలల్లోనే ధరలు 20 శాతం పెరగడం గమనార్హం. 2024లో 6 మిలియన్ టన్నుల మొక్కజొన్నను ఇథనాల్ తయారీకి వినియోగించగా, ప్రస్తుతం ఆ వినియోగం 17 మిలియన్ టన్నులకు చేరింది. ఇథనాల్ విధానంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు, కోళ్ల మరణాల రేటు పెరగడం వంటివి కూడా ఇటీవల ధరల పెరుగుదలకు ఇతర కారణాలని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఉల్లి, బెల్లం వంటి ఇతర నిత్యావసరాల ధరలు కూడా భారమవ్వడం సామాన్య వినియోగదారులపై అదనపు ఒత్తిడిని కలిగిస్తోంది.

## ఏఐ జాబ్స్.. 23% హై!

**భారత్‌లో ఏఐ ఉద్యోగాలకు భారీ డిమాండ్.. రెండేళ్లలో 23 శాతం పెరిగిన వేతనాలు**




బెంగళూరు: భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఈ రంగంలో పనిచేసే ఉద్యోగుల జీతాలు 2024 నుంచి 2026 మధ్య ఏకంగా 23 శాతం పెరిగాయి. అదే సమయంలో కొన్ని సంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల్లో వేతనాలు తగ్గినట్లు ఉద్యోగాల వేదిక 'ఫౌండిట్' నివేదిక వెల్లడించింది. 2025లో ఏఐ ఉద్యోగాల జీతాలు ఏడాది ప్రాతిపదికన 12 శాతం పెరిగాయి. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వృద్ధి. కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ, సెమీకండక్టర్లలో 9 శాతం చొప్పున వేతనాలు పెరిగాయి. మరోవైపు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఈ–కామర్స్ రంగాల్లో జీతాలు తగ్గాయి. ఐటీ సర్వీసెస్‌లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. ఏఐ రంగంలో 0–3 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు ఏడాదికి రూ. 8.87 లక్షల నుంచి రూ. 15.41 లక్షల వరకు వేతనం లభిస్తోంది. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99 లక్షల నుంచి రూ. 89.24 లక్షల వరకు చేరుతోంది. ప్రత్యేక నైపుణ్యాలు అవసరమైన కంపెనీలు, ఏఐ స్టార్టప్‌లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఎక్కువగా ఉండటంతో దేశంలో అత్యధిక జీతాలు అందించే మార్కెట్‌గా బెంగళూరు నిలిచింది. అక్కడ సీనియర్ ఏఐ నిపుణులకు రూ. 61.70 లక్షల నుంచి రూ. 91.25 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ఢిల్లీ, ముంబైతో పోలిస్తే ఇది దాదాపు 10–15 శాతం ఎక్కువ. హైదరాబాద్ కూడా వేగంగా ఎదుగుతున్న మార్కెట్‌గా నివేదిక పేర్కొంది. సైబర్ సెక్యూరిటీలో సీనియర్ ఉద్యోగులకు రూ. 97.81 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ట్రాక్ చేసిన విభాగాల్లో ఇదే అత్యధిక వేతన పరిమితి. ఇదే సమయంలో ఐటీ, ఐటీ సర్వీసెస్‌లో 0–3 ఏళ్ల అనుభవం ఉన్నవారి జీతాలు రూ. 2.68 లక్షల నుంచి రూ. 5.08 లక్షల వరకు ఉన్నాయి. 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారికి రూ. 57.55 లక్షల నుంచి రూ. 72.13 లక్షల వరకు లభిస్తున్నాయి. ఈ రెండు విభాగాల్లో గతేడాది జీతాలు 1 శాతం తగ్గాయి. నైపుణ్యాలకు అనుగుణంగానే భవిష్యత్తులో జీతాల పెరుగుదల ఉంటుందని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి వ్యాపార అవసరాలకు నేరుగా ఉపయోగపడే నైపుణ్యాలకు కంపెనీలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయని చెప్పారు.

## శరీరంలోకి డ్రగ్ డెలివరీ సులభతరం

బెంగళూరు: వైద్య రంగంలో, ముఖ్యంగా డ్రగ్ డెలివరీ (శరీరంలో నిర్దిష్ట భాగాలకు మందులను చేరవేయడం) ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు భారత శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. బిగుసుకుపోయి, ఘనరూపంలో ఉన్న పదార్థాలను సైతం తాత్కాలికంగా ద్రవరూపంలోకి మార్చే ఒక సరికొత్త పద్ధతిని కనుగొన్నారు. ఆకస్మికంగా ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా పదార్థాల 'జ్ఞాపకశక్తి' ముద్రలను చెరిపివేసి, వాటిని ప్రవహించేలా చేయవచ్చని నిరూపించారు. ఈ ఆవిష్కరణతో దుష్ప్రభావాలు తగ్గించి, మరింత సమర్థవంతంగా మందులను లక్షిత కణాలకు చేర్చవచ్చని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు ఈ కీలక ముందడుగు వేశారు. గ్లాస్ వంటి కొన్ని పదార్థాలు నిర్మాణాత్మకంగా ద్రవాలను పోలి ఉన్నప్పటికీ, యాంత్రికంగా ఘన పదార్థాల వలె ప్రవర్తిస్తాయి. అంతేకాకుండా, అవి తమ గత స్థితులను గుర్తుంచుకోగలవు. ఇలా బిగుసుకుపోయిన వ్యవస్థలను తిరిగి ప్రవహించేలా చేయడంపై పరిశోధకులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా, మైక్రోజెల్ కణాలను ఉపయోగించి ప్రయోగాలు నిర్వహించారు. ఈ మైక్రోజెల్ కణాలను వేగంగా వేడి చేసినప్పుడు, వాటిలోని కణాల అమరికలో మార్పులు జరిగి, ఆ వ్యవస్థ తాత్కాలికంగా ద్రవరూపంలోకి మారడాన్ని గమనించారు. ఈ ప్రక్రియలో పదార్థం తన గత స్థితికి సంబంధించిన జ్ఞాపకాలను కోల్పోతుందని గుర్తించారు. ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత 'జర్నల్ ఆఫ్ కొలాయిడ్ అండ్ ఇంటర్‌ఫేస్ సైన్స్'లో ప్రచురితమయ్యాయి. ఆర్ఆర్ఐలో పీహెచ్‌డీ విద్యార్థిని, ఈ పరిశోధన పత్రం యొక్క మొదటి రచయిత సోనాలి కవాలే, ఈ ప్రయోగాల కోసం ప్రత్యేకమైన మైక్రోజెల్ కణాలను వినియోగించారు. సాధారణంగా డైపర్లు, శానిటరీ న్యాప్‌కిన్‌లలో వాడే ఈ కణాలు, తమ బరువు కంటే 300 నుంచి 500 రెట్లు ఎక్కువ నీటిని పీల్చుకోగలవు. ఈ కణాలను నీటిలో కలిపి, స్థిరత్వం కోసం 4 డిగ్రీల సెల్సియస్ వద్ద శీతలీకరించారు. ఈ మిశ్రమాన్ని 20 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసే ప్రక్రియ, తిరిగి చల్లబరిచే ప్రక్రియ వేర్వేరు మార్గాల్లో జరగడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీన్ని 'అసౌష్టవత'గా పేర్కొన్నారు. అంటే, పదార్థం కేవలం తొలి, తుది ఉష్ణోగ్రతలపైనే కాకుండా, అది ప్రయాణించిన మార్గంపై కూడా ఆధారపడి ఉంటుందని స్పష్టమైంది. ఈ ఆవిష్కరణ వైద్య చికిత్సలో ఎంతో కీలకం కానుంది. దీని ద్వారా మందులను నియంత్రిత పద్ధతిలో, నేరుగా అవసరమైన శరీర భాగాలకు మాత్రమే విడుదల చేయవచ్చు. తద్వారా అనవసర దుష్ప్రభావాలను గణనీయంగా తగ్గించవచ్చని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. భవిష్యత్తులో ఉష్ణోగ్రత మార్పులతో పాటు, యాంత్రిక అఘాతాలు ఈ పదార్థాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అధ్యయనం చేయాలని పరిశోధక బృందం యోచిస్తోంది.

## బంగారం కొనడం ఆపాలి

**ప్రధాని మోదీకి శ్రీధర్ వెంబు మద్దతు**



చెన్నై: విదేశీ ప్రయాణాలు, బంగారం కొనుగోళ్లు, విదేశాల్లో పెళ్లిళ్లు వంటివి తగ్గించుకోవాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు వెనుక ఉన్న కీలక ఆర్థిక కారణాలను ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ జోహో సహ వ్యవస్థాపకుడు, చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ వెంబు విశ్లేషించారు. భారతదేశం వేగవంతమైన ఆర్థిక వృద్ధి దశలో ఉందని, అయితే కీలక రంగాల్లో దిగుమతులపై ఆధారపడటం వల్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసుకోవడం అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి రేటుతో దూసుకెళుతున్నప్పుడు, ప్రధాని ఇలా ఎందుకు కోరుతున్నారనే ప్రశ్న తలెత్తవచ్చని వెంబు పేర్కొన్నారు. "ఆర్థిక వ్యవస్థ ఎంత వేగంగా వృద్ధి చెందితే, ఇంధనం, సాంకేతిక పరికరాల అవసరం అంతగా పెరుగుతుంది. ప్రెసిషన్ మెషీన్లు, ముఖ్యమైన ముడి పదార్థాలు, సీపీయూలు, జీపీయూలు, అత్యాధునిక సాఫ్ట్‌వేర్ వంటి వాటిని దిగుమతి చేసుకోవడానికి మనకు విదేశీ మారక ద్రవ్యం అవసరం" అని ఆయన వివరించారు. ఈ అవసరాలను తీర్చుకోవడానికే అనవసరమైన విదేశీ ఖర్చులను తగ్గించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తూర్పు ఆసియా దేశాల ఆర్థిక నమూనాను ఉదహరించారు. ఆ దేశాలు కూడా అధిక జీడీపీ వృద్ధిని సాధిస్తూనే, అదే సమయంలో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకున్నాయని గుర్తు చేశారు. "పశ్చిమ దేశాలతో పోటీ పడే స్థాయికి రావడానికి తూర్పు ఆసియా దేశాలకు దశాబ్దాల సమయం పట్టింది. మనం కూడా ఇప్పుడు మంచి ప్రారంభ దశలో ఉన్నాం. కానీ, మనకు సమయం కావాలి" అని వెంబు అభిప్రాయపడ్డారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో పూర్తి నైపుణ్యం సాధించి, పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా ఇంధన స్వాతంత్ర్యం పొందిన రోజున, మనం ఇకపై విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉండదని శ్రీధర్ వెంబు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సెన్సెక్స్ 373 పాయింట్లు పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, బాండ్ ఈల్డ్స్ ఎగబాకడంతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. దీంతో ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకునే ఆసక్తి తగ్గింది. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 373.93 పాయింట్లు నష్టపోయి 76,570.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141.35 పాయింట్లు తగ్గి 23,914.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 24,000 స్థాయి కంటే దిగువన ఉన్నంతకాలం మార్కెట్‌లో బేరిష్ (అమ్మకాల ఒత్తిడి) ధోరణి కొనసాగే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు పెరిగినప్పుడు షేర్లను విక్రయించే 'సెల్ ఆన్ రైజ్' వ్యూహం అనుకూలంగా ఉండొచ్చని పేర్కొన్నారు. నిఫ్టీ మరింత పడితే 23,700–23,730 స్థాయికి చేరే అవకాశం ఉందని ఓ విశ్లేషకుడు అంచనా వేశారు. క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన మార్కెట్‌పై ప్రభావం చూపింది. కంపెనీల ఉత్పత్తి వ్యయాలు పెరిగే అవకాశాలు కూడా ఇన్వెస్టర్లను అప్రమత్తంగా మార్చాయి. మరోవైపు బాండ్ ఈల్డ్స్ పెరగడంతో ఈక్విటీలతో పోలిస్తే బాండ్లపై ఆసక్తి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. నిఫ్టీలో ఐషర్ మోటార్స్, విప్రో ఇండియా, బజాజ్ ఆటో షేర్లు ఎక్కువగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. ఆటో రంగం అత్యధికంగా దెబ్బతింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా పడిపోయింది. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మీడియా సూచీలు కూడా బలహీనంగా ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.53 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.33 శాతం నష్టపోయాయి. అయితే నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మార్కెట్ ట్రెండ్‌కు భిన్నంగా మెరుగ్గా రాణించింది. అధిక చమురు ధరలు, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్ వల్ల ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారని మార్కెట్ నిపుణులు తెలిపారు. దీంతో సమీప కాలంలో మార్కెట్‌లో అప్రమత్తమైన ధోరణి కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## సిక్కింలో 40 ప్రమాదకర సరస్సులు

**వెంటాడుతున్న హిమ సరస్సుల ముప్పు**

**వీటిలో 7 అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక**

గ్యాంగ్‌టక్: పొరుగు దేశం నేపాల్‌లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెన (గ్లేసియల్ లేక్ ఔట్‌బరస్ట్ ఫ్లడ్) సృష్టించిన పెను విషాదం నేపథ్యంలో సిక్కిం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న 40 హిమ సరస్సులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గుర్తించింది. వీటిలో ఏడు సరస్సులను 'అత్యంత ప్రమాదకర' జాబితాలో చేర్చారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించి, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించింది. ఈ ప్రమాదకర సరస్సులలో కొన్ని సముద్ర మట్టానికి సుమారు 17,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటి గట్టు తెంచుకున్నా భారీ విపత్తు సంభవించే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ తాంబే మాట్లాడుతూ, కొన్ని సరస్సులపై ఇప్పటికే శాస్త్రీయ అధ్యయనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సరస్సుల లోతు, నీటి నిల్వ సామర్థ్యం, మంచు కురిసే విధానం, కొండచరియలు విరిగిపడే ముప్పు వంటి అంశాలను నిపుణులు అంచనా వేస్తున్నారని ఆయన వివరించారు. ఆగస్టు 26న నేపాల్‌లో హిమ సరస్సు విచ్ఛిన్నం కావడం వల్ల సంభవించిన వరదల్లో ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 4,000 మంది గల్లంతయ్యారు. ఈ నేపథ్యంలో సిక్కింలో అటువంటి విపత్తు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్ఠమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది.

## డీఎంకే హయాంలోని రైతులపై కేసులన్నీ వాపస్

**తమిళనాడు సీఎం విజయ్ ప్రకటన**



చెన్నై: తమిళనాడులో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట లభించినట్లయింది. 2021 మే నుంచి 2026 మధ్య కాలంలో అప్పటి ఎం.కె. స్టాలిన్ ప్రభుత్వం సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు. ఆ సమయంలో రైతులు, ఉపాధ్యాయులపై పలు కేసులు నమోదు చేశారని, అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని విజయ్ స్పష్టం చేశారు. కేసుల ఎత్తివేత నిర్ణయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, 'నీట్'కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఎన్‌ఎల్‌సీ ఆందోళనకారులపై కేసులను రద్దు చేయాలని పీఎంకే పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే, ఈ డిమాండ్లపై టీవీకే ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

వయ్యారి చిత్రం


అషిక రంగనాథ్

## 'ఓజీ 2' స్పెషల్ వీడియో


పవన్ కల్యాణ్ బర్త్‌డే సందర్భంగా ఆయన అభిమానులకు 'ఓజీ' సీక్వెల్ అప్‌డేట్ ఇచ్చాడు దర్శకుడు సుజీత్. ఈ మేరకు బుధవారం 'ఓజీ యూనివర్స్' పేరిట ఓ స్పెషల్ వీడియో విడుదల చేశారు. అందులో 'ఓజీ'కి సీక్వెల్‌గా తెరకెక్కించే చిత్రం గురించి పవన్ కల్యాణ్‌తో సుజీత్, సంగీత దర్శకుడు తమన్ చేస్తున్న చర్చలు ఆస్తకి రేపుతున్నాయి. 'యాన్ ఇండియన్ ఆరిజిన్.. సౌత్‌ఈస్ట్ ఎమోషన్.. వెస్ట్రన్ ప్రెజెంటేషన్..' అనే మాటలు ఆ వీడియోలో ఉన్నాయి. ఈ సినిమాను పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ నిర్మిస్తోంది. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.




## స్వర భాస్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు



బాలీవుడ్ నటి స్వర భాస్కర్ చేసిన వ్యాఖ్యలు మరోసారి తీవ్ర దుమారం రేపాయి. 2018లో విడుదలైన 'పద్మావత్' చిత్రంలోని 'జోహార్' (సామూహిక ఆత్మాహుతి) ఘట్టాన్ని విమర్శిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ, కర్ణిసేన వంటి సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఆమె మాట్లాడారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్వర భాస్కర్, శత్రువుల చేతిలో చిక్కకుండా ఉండేందుకు ఆత్మాహుతి చేసుకోవడాన్ని గొప్పగా చిత్రించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఆత్మహత్య చేసుకోకపోతే నన్ను నేను పిరికిదానిలా భావించాలా? అత్యాచార ఘటనలు పెరుగుతున్న ప్రస్తుత సమాజంలో బాధితులకు మనం ఇలాంటి సందేశమే ఇవ్వాలనుకుంటున్నామా?" అని ఆమె ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో, తాను రాణి పద్మావతిని ఉద్దేశించి 'పిరికిపంద' అనే పదాన్ని వాడలేదని ఆమె వివరణ ఇచ్చారు. ఈ వివాదంపై బీజేపీ తీవ్రస్థాయిలో స్పందించింది. స్వర భాస్కర్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా విమర్శించారు. మహిళలు తోటి మహిళలను గౌరవించుకోవాలని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. మరోవైపు, హిందూ సమాజాన్ని, రాజపుత్ర మహిళలను కించపరిచారంటూ బీహార్‌కు చెందిన బీజేపీ నేత కృష్ణ కుమార్ సింగ్ ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణిసేన సైతం స్వర భాస్కర్‌ను తీవ్రంగా హెచ్చరించింది. "హిందూ యోధురాళ్లను, వారి అత్యున్నత త్యాగాలను అవమానిస్తే కర్ణిసేన ఎప్పటికీ క్షమించదు" అని ఆ సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు కీర్తి రాథోడ్ స్పష్టం చేశారు. కేవలం హిందూ సంప్రదాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తూ, ఇతర మతాల్లోని అంశాలపై ఎందుకు మౌనంగా ఉంటారని ఆమె ప్రశ్నించారు. 'పద్మావత్' చిత్రంలో రాణి పద్మావతి తన అనుచర మహిళలతో కలిసి అల్లావుద్దీన్ ఖిల్జీ సైన్యం చేతిలో బందీలుగా చిక్కకుండా అగ్నిప్రవేశం చేసే ఘట్టాన్ని చూపించారు. 16వ శతాబ్దానికి చెందిన సూఫీ కవి మాలిక్ ముహమ్మద్ జయసి రచించిన కావ్యం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.




## అక్టోబర్ 15నే 'జైలర్ 2' రిలీజ్

సూపర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా విడుదలపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ చిత్రం వాయిదా పడుతోందంటూ వస్తున్న వార్తలకు చిత్ర నిర్మాణ సంస్థ ఫుల్‌స్టాప్ పెట్టింది. ముందుగా ప్రకటించినట్లే దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసి అభిమానుల్లో జోష్ నింపింది. 2023లో విడుదలై సంచలన విజయం సాధించిన 'జైలర్' సినిమాకు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అయితే, సినిమా షూటింగ్ పూర్తయినా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఇంకా పూర్తి కాలేదని, దీనివల్ల సినిమా అనుకున్న సమయానికి రావడం కష్టమంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో జోరుగా చక్కర్లు కొట్టడంతో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో సన్ పిక్చర్స్ సంస్థ ఈ వదంతులను ఖండిస్తూ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చింది. వాయిదా వార్తల్లో నిజం లేదని చెప్పిన మేకర్స్, విడుదల తేదీని మరోసారి కన్ఫర్మ్ చేస్తూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ పోస్టర్‌లో రజనీకాంత్ చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్ లుక్ తో కనిపిస్తున్నారు. దీంతో 'జైలర్ 2' దసరా బరిలో ఉండటం ఖాయమని తేలిపోయింది. ఈ సినిమాలో భారీ తారాగణం నటిస్తోంది. రజనీతో పాటు రమ్యకృష్ణ, మిథున్ చక్రవర్తి, ఎస్జే సూర్య, విద్యా బాలన్, సూరజ్ వెంజరమూడు, మిర్నా, యోగిబాబు వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అంతేగాక మోహన్ లాల్, శివ రాజ్ కుమార్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి, జాకీ ష్రాఫ్ వంటి అగ్ర తారలు ప్రత్యేక అతిథి పాత్రల్లో మెరవనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. బ్లాక్ బస్టర్ 'జైలర్'కు సంగీతం అందించిన అనిరుధ్ రవిచందర్ ఈ సీక్వెల్‌కు కూడా స్వరాలు సమకూరుస్తున్నారు. తాజా ప్రకటనతో సినిమాపై నెలకొన్న అనుమానాలు పటాపంచలయ్యాయి.

## ఈ ప్రేమను నా అదృష్టం

ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా.. దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన చిత్రం 'ఆవారాపన్ -2'. ఈ యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం ఆగస్టు 14న విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అంతే కాకుండా ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ. 200 కోట్లు సాధించి రికార్డులు సృష్టించింది. ఈ సినిమా ఇంత సక్సెస్ కావడంతో హీరోయిన్ దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ మేరకు తన ఎక్స్ అకౌంట్ వేదికగా.. 'మనమందరం ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక కథను చెప్పే ఈ ప్రయాణంలో.. ఇంత అద్భుతమైన, మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ బృందంలో భాగం కావడం నిజంగా ఒక గౌరవంగా భావిస్తున్నా. 'ఆవారాపన్-2' సినిమాపై ప్రేక్షకులు చూపించిన ప్రేమకు ఎంతో కృతజ్ఞతతో ఉన్నాను. మీరు నాపై చూపిస్తున్న ఈ ప్రేమను పొందటం నా అదృష్టం. ఎంతో సంతోషంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది దిశా. కాగా.. 2007లో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా, మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఆవారాపన్'. అప్పట్లో ఈ చిత్రం మంచి టాక్ సొంతం చేసుకున్నప్పటికీ రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తే.. కేవలం రూ. 12 కోట్లు మాత్రమే వసూలు చేసింది. అలా యావరేజ్‌గా నిలిచిన ఈ మూవీకి ఇప్పుడు సీక్వెల్‌గా 'ఆవారాపన్-2' రాగా.. బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద రూ. 200 కోట్లు వసూలు రాబట్టడంతో అద్భుతంగా భావిస్తున్నారు సినీ విశ్లేషకులు.



## శ్రీకృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ నటుడు, అభినయ చక్రవర్తి కిచ్చా సుదీప్ తన పుట్టినరోజున అభిమానులకు అద్భుతమైన కానుక అందించారు. ఆయన కథానాయకుడిగా రాబోతున్న భారీ చారిత్రక చిత్రానికి 'దేవరాయ' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్‌తో కూడిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను చిత్ర బృందం బుధవారం విడుదల చేసింది. ఇందులో సుదీప్, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో రాజసంగా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రియా సుదీప్ తన సుప్రియాన్వి పిక్చర్ స్టూడియో ద్వారా ఈ సినిమాను సమర్పిస్తున్నారు. టైటిల్ వీడియోలో సుదీప్ లుక్ అత్యంత గంభీరంగా, రాజసం ఉట్టిపడేలా ఉంది. తలపై కిరీటం, మెడలో ముత్యాల హారాలు, ఇతర రాజాభరణాలతో ఆయన ఆహార్యం ఆకట్టుకుంటోంది. గౌర హరి అందించిన నేపథ్య సంగీతం ఈ వీడియోకు మరింత బలాన్ని చేకూర్చింది. "చరిత్రను మలుపుతిప్పిన సామ్రాజ్యం, ఒక శకాన్ని నిర్మించిన రాజు, కాలానికి అతీతంగా నిలిచిన లెజెండ్" అనే శక్తివంతమైన వాక్యాలతో చిత్ర బృందం 'దేవరాయ' పాత్రను పరిచయం చేసింది. ఈ వ్యాఖ్యలు శ్రీకృష్ణదేవరాయల కీర్తి ప్రతిష్ఠలకు అద్దం పడుతున్నాయి.






## బుక్‌మైషోలో 'రోమాంచకం' ట్రెండింగ్

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్న 'రోమాంచకం' చిత్రానికి ప్రీ రిలీజ్ దశలోనే అద్భుతమైన స్పందన లభిస్తోంది. నేటి నుంచి ఈ సినిమా ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, టికెట్ బుకింగ్స్ ప్లాట్‌ఫామ్‌లలో సినిమాకు విశేషమైన ఆదరణ కనిపిస్తోంది. ఈ చిత్రంలో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటించారు. ప్రముఖ టికెటింగ్ పోర్టల్ బుక్‌మైషోలో 24 గంటల్లోనే 'రోమాంచకం' చిత్రానికి భారీ స్థాయిలో టికెట్లు అమ్ముడవడం విశేషం. ఈ సినిమా ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉండటం, దీనిపై నెలకొన్న అంచనాలకు నిదర్శనంగా నిలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా బ్రాండ్ తోడవ్వడంతో ఈ చిన్న సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి ఏర్పడింది. వేణు గోపాల్ రెడ్డి ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. సందీప్ రెడ్డి వంగా సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై ఈ సినిమాను నిర్మించారు. "ప్రేమ, హాస్యం, ఉత్కంఠ" అనే ట్యాగ్‌లైన్‌తో వస్తుండటంతో ఇది ఒక విభిన్నమైన ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని తెలుస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక ప్రధాన పాత్రలు పోషించారు. సాధారణంగా పెద్ద సినిమాలకు కనిపించే బుకింగ్స్ ట్రెండ్, 'రోమాంచకం' చిత్రానికి కూడా కనిపిస్తుండటం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సందీప్ వంగా సమర్పణ సినిమాకు అతిపెద్ద బలంగా మారిందని, ఈ పాజిటివ్ బజ్ ఓపెనింగ్స్‌కు ఎంతగానో దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నేటి ప్రీమియర్లతో ఈ 'రోమాంచకం' ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.



# రో-కోనే భారత్ బలం

భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.



# గిల్, బుమ్రా.. డౌన్!

## పడిపోయిన ర్యాంకులు

ఐసీసీ విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా ప్లేయర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. ఇటీవల జరిగిన శ్రీలంక పర్యటనలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తమ స్థానాలను కోల్పోయారు. మరోవైపు, యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానాన్ని సాధించాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల్లో మూడు ఇన్నింగ్స్‌ల్లో కేవలం ఒకే ఒక్క అర్ధశతకం సాధించిన శుభ్‌మన్ గిల్.. తాజాగా ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు కోల్పోయి.. తొమ్మిదో స్థానంలో నిలిచాడు. వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ ఏడో స్థానంతో భారత్ తరఫున బ్యాటర్లలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఓపెనర్ యశస్వి జైస్వాల్ 11వ స్థానంలో నిలిచాడు. శ్రీలంక పర్యటనలో రెండు టెస్టుల్లో కలిపి రెండు శతకాలతో బాదిన దేవదత్ పడిక్కల్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 54వ స్థానానికి చేరుకున్నాడు. లంక గడ్డపై భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. బౌలింగ్ విభాగంలోనూ భారత్‌కు బిగ్ షాక్ తగిలింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రెండో స్థానాన్ని కోల్పోయి.. మూడో స్థానానికి పడిపోయాడు. మోకాలి గాయం కారణంగా బుమ్రా జూలై మధ్య నుంచి ఆటకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. బౌలర్ల జాబితాలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ తొలి స్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీ రెండో స్థానంలో నిలిచాడు.



## 2027 మహిళల

# ఛాంపియన్స్ ట్రోఫీ భారత్‌లోనే!

**శ్రీలంక నుంచి భారత్‌కు మార్పు**

లంక క్రికెట్ బోర్డులో ప్రభుత్వ జోక్యమే కారణం: ఐసీసీ

ముంబై, వడోదర వేదికలుగా ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు టోర్నీ

**అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ-2027 ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి భారత్‌కు బదిలీ చేసింది. శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్‌ఎల్‌సీ)లో ప్రభుత్వ జోక్యం, కొనసాగుతున్న పరిపాలన సంక్షోభం కారణంగా ఈ మార్పు చేసినట్లు ఐసీసీ బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.**

**2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ఈ టోర్నీ జరగనుంది. ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ), వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలు మ్యాచ్‌లకు వేదికలుగా నిలవనున్నాయి. ఆసక్తికరంగా, 2025 మహిళల వన్డే ప్రపంచకప్‌ను భారత్ గెలుచుకున్న నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం.**

వాస్తవానికి ఈ టోర్నమెంట్‌కు శ్రీలంక ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే, శ్రీలంక క్రికెట్ బోర్డులో అక్కడి ప్రభుత్వం జోక్యం చేసుకుని, రాజ్యాంగ, పరిపాలన సంస్కరణల కోసం ఓ తాత్కాలిక 'ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ'ని ఏర్పాటు చేసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం క్రికెట్ బోర్డుల వ్యవహారాల్లో రాజకీయ జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ప్రభుత్వ నియమిత కమిటీలను గుర్తించబోమని స్పష్టం చేసిన ఐసీసీ, ఆ కమిటీ ఏర్పడినప్పటి నుంచి ఎస్‌ఎల్‌సీ ప్రతినిధులను బోర్డు సమావేశాలకు దూరంగా ఉంచుతోంది. ఈ సంస్కరణలు పూర్తికాని నేపథ్యంలోనే టోర్నీని తరలించాలని నిర్ణయించినట్లు ఐసీసీ పేర్కొంది. శ్రీలంకకు ప్రత్యామ్నాయ ఆతిథ్య దేశం కోసం బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాల నుంచి కూడా ప్రతిపాదనలు రాగా, అన్నింటినీ పరిశీలించిన అనంతరం ఐసీసీ బోర్డు భారత్‌ను ఎంపిక చేస్తూ తుది నిర్ణయం తీసుకుంది. "ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ 2027 మహిళల క్రికెట్‌లో ఒక ఉత్తేజకరమైన కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లను ఒకచోట చేర్చే ఈ టోర్నీ, ర్యాంకింగ్స్‌లో పైకి ఎదగడానికి జట్లకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది" అని ఐసీసీ ఛైర్మన్ జై షా అన్నారు. ఈ టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొంటాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఇండియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడతాయి. టాప్-2



జట్లు ఫిబ్రవరి 28న ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకుంటాయి. జూలై 6 నాటి కట్-ఆఫ్ తేదీ నాటికి ఉన్న ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ జట్లు అర్హత సాధించాయి. పరిపాలన సమస్యల కారణంగా శ్రీలంక ఓ గ్లోబల్ ఈవెంట్‌ను కోల్పోవడం ఇది రెండోసారి. గతంలో 2024 పురుషుల అండర్-19 ప్రపంచకప్‌ను కూడా దక్షిణాఫ్రికాకు తరలించారు. ఈ ఛాంపియన్స్ ట్రోఫీ పూర్తి షెడ్యూల్, టికెటింగ్ వివరాలను త్వరలో విడుదల చేస్తామని ఐసీసీ తెలిపింది.

# ధోనిని అవమానించలేదు

ఐపీఎల్-2024లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ప్రయాణం ఊహకందని విధంగా సాగింది. తొలి ఆరు మ్యాచ్‌లలో ఒక్కటి మాత్రమే గెలిచి డీలాపడ్డ ఆర్సీబీ.. ఆ తర్వాత వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచి అద్భుతం చేసింది. ముఖ్యంగా లీగ్ దశలో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో తీవ్రమైన ఒత్తిడిలోనూ రాణించింది. చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను 27 పరుగుల తేడాతో ఓడించింది. తద్వారా ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుని.. నాటి డిఫెండింగ్ చాంపియన్ చెన్నైని ఎలిమినేట్ చేసింది. సొంతమైదానం చిన్నస్వామి స్టేడియంలో ఈ విజయం సాధించడంతో ఆర్సీబీ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ క్రమంలో మ్యాచ్ ముగిసిన తర్వాత చెన్నై దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనితో కరచాలనం చేసేందుకు ఆర్సీబీ ఆటగాళ్లు ఆలస్యం చేశారని.. లెజెండరీ ఆటగాడి పట్ల ఇలా వ్యవహరించడం సరికాదనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆర్సీబీ మాజీ క్రికెటర్ కర్ణ్ శర్మ తాజాగా ఈ విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. రెవ్‌స్పోర్ట్జ్‌తో మాట్లాడుతూ... "ఆరోజు అసలు అలాంటిదేమీ జరగలేదు. మేము ఎవరినీ అవమానించలేదు. నిజానికి ఆరోజు మాకు అతిపెద్ద విజయం. వరుసగా ఆరు మ్యాచ్‌లు ఓడి.. ఆ తర్వాత తిరిగి ఆరు మ్యాచ్‌లలో గెలిచి ప్లే ఆఫ్స్ చేరడం మామూలు విషయం కాదు. అందుకే మా సంబరాలు ఆకాశాన్నంటాయి. అంతే తప్ప చెన్నై జట్టుతో మాకు ఎలాంటి విభేదాలు రాలేదు. అయితే, మేము ధోనిని కలవలేకపోయాము.

# గంభీర్, అగార్కర్ భవితవ్యం తేలేది నేడే

యూకే పర్యటనలో భారత జట్టు వైఫల్యంపై బీసీసీఐ నిర్వహించాలనుకున్న సమీక్ష సమావేశానికి ముహూర్తం ఖరారైంది. వాస్తవానికి ఇంగ్లండ్ పర్యటన పూర్తైన వెంటనే ఈ సమావేశం జరగాల్సి ఉంది. కానీ, జింబాబ్వే పర్యటన, శ్రీలంకలో టెస్ట్ సిరీస్ కారణంగా దీనిని వాయిదా వేశారు. అయితే గురువారం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరగనున్నట్లు ఓ జాతీయ మీడియా పేర్కొంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్, సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరు కానున్నారు. బీసీసీఐ నుంచి వారికి పిలుపు వెళ్లిందని సమాచారం. ఇవాళ(బుధవారం) రాత్రికే వాళ్లు ముంబైకి చేరాలని సందేశం వెళ్లినట్లు తెలుస్తోంది. అలానే ఆటగాళ్లు తరచూ గాయాల బారిన పడటం, భవిష్యత్తులో జరిగే సిరీస్‌లకు అనుసరించాల్సిన వ్యూహాలపై బీసీసీఐ సభ్యులతో టీమ్ మేనేజ్‌మెంట్ చర్చించనుంది. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటన, స్వదేశంలో జరిగే బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్, పురుషుల వన్డే ప్రపంచ కప్ 2027కు అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా ఈ సమావేశంలో చర్చకు రానున్నాయని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్

కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గెలిపించిన తిలక్ వర్మ

బంతితో చెలరేగిన పేసర్ నిధీశ్

ఫైనల్లో ఈస్ట్ జోన్‌తో తలపడనున్న సౌత్ జోన్

చెన్నై వేదికగా సెప్టెంబర్ 6 నుంచి టైటిల్ పోరు



దులీప్ ట్రోఫీ 2026/27 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించి, టైటిల్ పోరుకు అర్హత సాధించేలా చేశాడు. సెప్టెంబర్ 6 నుంచి చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఫైనల్లో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. మ్యాచ్ చివరి రోజు 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్‌కు కెప్టెన్ తిలక్ వర్మ (79 బంతుల్లో 51 నాటౌట్) అండగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన సెంచరీ (116 నాటౌట్)తో జట్టును ఆదుకున్న తిలక్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 80 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారంభించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు. వరుస విరామాల్లో వికెట్లు తీసి నార్త్ జోన్ పతనాన్ని శాసించాడు. చివరి మూడు వికెట్లను పడగొట్టి, ఇన్నింగ్స్‌లో మొత్తం 5 వికెట్లు (5/56) సాధించాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 10వ ఐదు వికెట్ల ప్రదర్శన. దీంతో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 297 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో సౌత్ జోన్‌కు ఓపెనర్ రికీ భుయ్ (42) దూకుడైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, లంచ్ విరామానికి ముందు, ఆ తర్వాత నార్త్ జోన్ స్పిన్నర్ అబిద్ ముస్తాక్ విజృంభించడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. రికీ భుయ్‌ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయగా, షేక్ రషీద్, నారాయణ్ జగదీశన్ (43) వికెట్లను ముస్తాక్ పడగొట్టాడు. దీంతో సౌత్ జోన్ 102 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఒకింత కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ అయిన స్మరణ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ, అవసరమైనప్పుడు వేగం పెంచుతూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. గతేడాది ఫైనల్లో ఓటమిపాలైన సౌత్ జోన్, ఈసారి బలమైన ఆత్మవిశ్వాసంతో టైటిల్ పోరుకు సిద్ధమవుతోంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఓడించి ఈస్ట్ జోన్ ఫైనల్‌కు చేరుకుంది. విశేషమేమిటంటే.. 1970/71 సీజన్ తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడటం ఇదే తొలిసారి.


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# లింగ నిష్పత్తి.. సమాజానికి అద్దం

ఆడ, మగ నిష్పత్తిలో తేడా కేవలం గణాంకాల సమస్య కాదు.. అది సమాజపు ఆలోచనా విధానానికి అద్దం. సాంకేతికంగా, ఆర్థికంగా ఎంత అభివృద్ధి సాధించినా ఆడపిల్ల పుట్టుకను భారంగా భావించే మనస్తత్వం కొనసాగితే ఆ అభివృద్ధికి అర్థం ఉండదు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, ఆడపిల్లలపై వివక్ష, బాలికల విద్యకు అడ్డంకులు వంటి కారణాలు లింగ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. ఆడపిల్లకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడం కుటుంబం నుంచి ప్రారంభం కావాలి. విద్య, ఉపాధి, ఆస్తి హక్కులు, ఆరోగ్యం, భద్రత విషయంలో సమానత్వం పాటించినప్పుడే మార్పు సాధ్యమవుతుంది. చట్టాలు కఠినంగా ఉండటం మాత్రమే కాదు.. వాటి అమలు కూడా అంతే పకడ్బందీగా ఉండాలి. లింగ నిష్పత్తి మెరుగుపడటం అంటే సంఖ్యలు సమం కావడం మాత్రమే కాదు. ఆడపిల్లను కుటుంబానికి భారంగా కాకుండా భవిష్యత్తు బలంగా చూడగల సామాజిక దృక్పథం ఏర్పడటం. ప్రతి ఆడపిల్లకు గౌరవం, రక్షణ, విద్య, స్వేచ్ఛ లభించినప్పుడే నిజమైన సమాజ ప్రగతి సాధ్యమవుతుంది. లింగ సమానత్వం లక్ష్యం కాదు.. సమాజ అభివృద్ధికి అది పునాది.

# శ్రీ కృష్ణుడి బాటలో బీసీల ధర్మపోరాటం!

శ్రీ కృష్ణ జన్మాష్టమి అంటే కేవలం భక్తి, ఆధ్యాత్మికతతో ముడిపడిన పర్వదినం మాత్రమే కాదు. ధర్మం, న్యాయం, కర్తవ్యం, ఆత్మవిశ్వాసం, అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యం వంటి శాశ్వత విలువలను మనకు గుర్తుచేసే సందర్భం. యాదవ వంశంలో జన్మించిన శ్రీకృష్ణుడు తన జీవితమంతా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే ధర్మం వైపు నిలిచాడు. అధర్మాన్ని ప్రశ్నించాడు. బలహీనుల పక్షాన నిలిచాడు. అవసరమైనప్పుడు సమాజాన్ని సరైన దిశలో నడిపించే మార్గదర్శిగా వ్యవహరించాడు. అందుకే శ్రీకృష్ణుని జీవితం నేటి సామాజిక పరిస్థితుల్లోనూ ఒక స్ఫూర్తిదాయక సందేశాన్ని అందిస్తుంది. మహాభారతంలో శ్రీకృష్ణుడి పాత్ర కేవలం ఒక రాజనీతిజ్ఞుడిదే కాదు. అన్యాయం పెరుగుతున్నప్పుడు మౌనం వహించకుండా ధర్మాన్ని కాపాడేందుకు కార్యాచరణ అవసరమని చాటి చెప్పిన నాయకత్వానికి ఆయన ప్రతీక. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు అర్జునుడికి భగవద్గీత ద్వారా అందించిన బోధనలోనూ ఇదే సారాంశం కనిపిస్తుంది. కర్తవ్యాన్ని విస్మరించడం పరిష్కారం కాదని, న్యాయం కోసం నిలబడటం అవసరమని శ్రీకృష్ణుడు బోధించాడు. ఆ ధర్మస్ఫూర్తిని నేటి సామాజిక వాస్తవికతతో అనుసంధానించాల్సిన అవసరం ఉంది. భారత సమాజ నిర్మాణంలో వెనుకబడిన తరగతుల (బీసీ) పాత్ర అపారమైనది. వ్యవసాయం నుంచి పశుపోషణ వరకు, చేతివృత్తుల నుంచి సేవారంగం వరకు, చిన్న వ్యాపారాల నుంచి ఉత్పత్తి రంగం వరకు దేశ ఆర్థిక, సామాజిక ప్రగతికి బీసీ సమాజాలు అందించిన సేవ విశేషమైనది. తరతరాలుగా శ్రమను నమ్ముకుని జీవనాన్ని నిర్మించుకున్న అనేక వృత్తి సముదాయాలు దేశ సంస్కృతిని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, స్థానిక జీవన విధానాన్ని నిలబెట్టాయి. అయితే జనాభాలో గణనీయమైన వాటా ఉన్నప్పటికీ విద్య, ఉపాధి, ఆర్థిక ప్రగతి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి కీలక రంగాల్లో తమకు తగిన అవకాశాలు ఇంకా పూర్తిస్థాయిలో లభించడం లేదనే ఆవేదన బీసీ సమాజంలో ఉంది. ఇది ఒక వర్గానికి సంబంధించిన సాధారణ అసంతృప్తిగా కొట్టిపారేయలేని అంశం. ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ హక్కులు, ఆత్మగౌరవానికి సంబంధించిన ప్రశ్న. అందుకే బీసీల హక్కుల కోసం జరిగే పోరాటాన్ని కేవలం రాజకీయ కోణంలో చూడటం సముచితం కాదు. సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు అందాలన్న ప్రజాస్వామ్య ఆకాంక్షలో భాగంగానే దీనిని చూడాలి. శ్రీకృష్ణుని ధర్మబోధ మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతుంది–న్యాయం కోసం నిలబడటం అంటే మరొకరిపై ద్వేషం పెంచుకోవడం కాదు. మన హక్కులను సాధించుకోవడం అంటే ఇతరుల హక్కులను హరించడం కాదు. సమానత్వం కోరడం అంటే ఎవరి ఆధిపత్యాన్నీ సవాలు చేయడం మాత్రమే కాదు; ప్రతి మనిషికీ గౌరవప్రదమైన అవకాశాలు లభించే సమాజాన్ని నిర్మించాలన్న సంకల్పం. అదే స్ఫూర్తితో బీసీ సమాజం తన భవిష్యత్తు కోసం ముందుకు సాగాల్సిన సమయం ఇది.



విద్యలో బీసీ విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందాలి. నాణ్యమైన విద్య ఆర్థిక స్థోమతకు పరిమితం కాకూడదు. పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడిన వర్గాల యువతకు సముచిత ప్రోత్సాహం లభించాలి. ఉపాధి అవకాశాల్లో సమానత్వం పెరగాలి. సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ఆధునిక సాంకేతికత, పెట్టుబడి, మార్కెట్, శిక్షణ అందాలి. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి, వృత్తి ఆధారిత ఆర్థిక కార్యకలాపాలు బలోపేతం కావాలి. అంతకంటే ముఖ్యంగా రాజకీయ ప్రాతినిధ్యంపై సార్థకమైన చర్చ జరగాలి. ప్రజాస్వామ్యంలో జనాభాలోని ప్రతి వర్గానికీ నిర్ణయాత్మక వ్యవస్థల్లో తగిన స్వరం ఉండటం అత్యంత కీలకం. ప్రాతినిధ్యం అనేది పదవుల కోసం చేసే పోటీ మాత్రమే కాదు; విధాన నిర్ణయాల్లో తమ అవసరాలు, సమస్యలు ప్రతిబింబించేందుకు అవసరమైన ప్రజాస్వామ్య సాధనం. ఇందుకోసం బీసీ సమాజంలో రాజకీయ చైతన్యంతో పాటు రాజ్యాంగ అవగాహన పెరగాలి. హక్కులు తెలిసిన సమాజమే వాటిని సమర్థంగా సాధించుకోగలదు. విద్యావంతులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, వృత్తిదారులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, యువత–అందరూ తమ తమ రంగాల్లో చైతన్యవంతులై ఒక సానుకూల సామాజిక ఉద్యమానికి బలమివ్వాలి. అయితే ఈ ప్రయాణంలో ఒక పెద్ద సవాలు ఉంది–అంతర్గత విభజనలు. బీసీ సమాజం అనేక కులాలు, వృత్తి సముదాయాలు, భిన్న సామాజిక నేపథ్యాలతో కూడిన విస్తృత సమూహం. ఈ వైవిధ్యం బలహీనతగా మారకూడదు. ఒకరి సమస్య మరొకరికి సంబంధం లేనిదిగా భావించే పరిస్థితి మారాలి. పరస్పర గౌరవం, సమన్వయం, ఐక్యత పెరగాలి. కులాల మధ్య పోటీ కంటే సామాజిక పురోగతికి అవసరమైన ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో ఈ పోరాటం రాజ్యాంగబద్ధమైన మార్గంలోనే సాగాలి. ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం కోల్పోకుండా, చట్టబద్ధమైన పద్ధతుల్లో హక్కుల కోసం ఉద్యమించాలి. ఆందోళనలో ఆవేశం ఉండొచ్చు కానీ ద్వేషం ఉండకూడదు. ప్రశ్నించడంలో పదును ఉండొచ్చు కానీ హింసకు తావుండకూడదు. లక్ష్యం స్పష్టంగా ఉండాలి కానీ మార్గం ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి. ఎందుకంటే ధర్మం అంటే కేవలం దేవుడిని పూజించడం కాదు. అన్యాయాన్ని చూసి ప్రశ్నించడం కూడా ధర్మమే. సమానత్వం కోసం నిలబడటం కూడా ధర్మమే. బలహీనులకు అవకాశాలు కల్పించాలని కోరడం కూడా ధర్మమే. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజాస్వామ్య పద్ధతిలో సాధించేందుకు కృషి చేయడం కూడా ధర్మమే.

శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో నడవడం అంటే ఆయనను ఆరాధించడం మాత్రమే కాదు; ఆయన బోధించిన విలువలను సామాజిక జీవితంలో ఆచరించడం. కర్తవ్యాన్ని నిర్వర్తించడం, అన్యాయాన్ని ఎదిరించడం, న్యాయం కోసం నిలబడటం, అవసరమైనప్పుడు సమాజాన్ని సంఘటితం చేయడం–ఇవే ఆ ధర్మస్ఫూర్తికి నిజమైన ప్రతిరూపాలు. ఈ జన్మాష్టమి సందర్భంగా బీసీ సమాజం ఒక కొత్త సంకల్పం తీసుకోవాలి. అది ఎవరి మీద పోరాటం కాదు. ఎవరి హక్కులను లాక్కోవాలన్న ప్రయత్నం కాదు. తరతరాలుగా తమను వెంటాడుతున్న సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధిగమించి సమాన అవకాశాలను సాధించాలన్న ప్రజాస్వామ్య సంకల్పం.

ఈ పోరాటం ఎవరి మీద కాదు.. అన్యాయం మీద.

ఈ పోరాటం ఎవరి హక్కుల కోసం కాదు.. అందరికీ సమాన హక్కుల కోసం.

ఈ పోరాటం విభజన కోసం కాదు.. సామాజిక సమానత్వం కోసం.

ఈ పోరాటం ద్వేషం కోసం కాదు.. బీసీల ఆత్మగౌరవం కోసం.

శ్రీకృష్ణుని ధర్మస్ఫూర్తి నుంచి ప్రేరణ పొంది బీసీ సమాజం విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవం కోసం ఐక్యంగా, శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా ముందుకు సాగాలి. ఆత్మగౌరవం నినాదంగా మిగలకుండా ఆత్మవిశ్వాసంగా మారాలి. హక్కుల డిమాండ్ కేవలం రాజకీయ నినాదంగా కాకుండా సామాజిక చైతన్యంగా రూపుదిద్దుకోవాలి. ఈ జన్మాష్టమి మనకు భక్తితో పాటు బాధ్యతను కూడా గుర్తుచేయాలి. శ్రీకృష్ణుని స్మరించుకుంటూ ధర్మం వైపు నిలబడే ధైర్యాన్ని అలవరచుకోవాలి. సమానత్వం కోసం స్వరం వినిపించాలి. సామాజిక న్యాయం కోసం ఐక్యంగా కదలాలి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ హక్కుల సాధనకు కృషి చేయాలి. శ్రీకృష్ణుడి బాటలో సాగేది కేవలం భక్తి యాత్ర కాదు.. ధర్మం, న్యాయం, సమానత్వం వైపు సాగే సామాజిక యాత్ర.

**అదే బీసీల ధర్మపోరాటానికి దిశ.**
**అదే ఆత్మగౌరవానికి బాట.**
**అదే శ్రీకృష్ణుడికి అర్పించే నిజమైన నివాళి.**



**మహేశ్ గౌడ్,**
**రిసెర్చ్ స్కాలర్( ఐసీఎస్ఎస్ఆర్)**
**(రమేష్ యాదవ్ - ఉస్మానియా యూనివర్సిటీ ప్రోద్బలంతో..)**

తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 డిసెంబర్ 7 ఒక కీలక మలుపు. పదేళ్లపాటు ఒకే పార్టీ పాలన అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎ. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజల ఆకాంక్షలు, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామిక విలువలను కేంద్రంగా చేసుకుని ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆ సమయంలో ప్రకటించింది. 2026 సెప్టెంబర్ 1 నాటికి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. వెయ్యి రోజులు అంటే ఒక ప్రభుత్వ పనితీరును సమీక్షించడానికి తగిన కాలం. ఎన్నికల హామీలు ఎంతవరకు అమలయ్యాయి? ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చింది? ఇంకా ఏ సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన సందర్భమిది. వెయ్యి రోజుల పాలనను కేవలం విజయాల జాబితాగా చూడటం ఎంత తప్పో, ప్రతిపక్ష విమర్శల ఆధారంగా పూర్తిగా వైఫల్యంగా చిత్రీకరించడం కూడా అంతే తప్పు.

# వెయ్యి రోజులు.. మార్పు!



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**



ప్రజా పాలనను అంచనా వేయాలంటే ప్రభుత్వ నిర్ణయాలు, గణాంకాలు, పథకాల అమలు, ప్రజల అనుభవాలు, ఆర్థిక పరిస్థితులు, ఇంకా పరిష్కారం కాని సమస్యలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలి. రైతు సంక్షేమం ఈ ప్రభుత్వ పనితీరుకు ప్రధాన కొలమానం. ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ ద్వారా 25 లక్షలకు పైగా రైతులకు ప్రయోజనం కల్పించింది. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు చెల్లించినట్లు, సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చినట్లు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించినట్లు చెబుతోంది. ఇవి రైతుకు తక్షణ ఆర్థిక ఊరట కలిగించే చర్యలే. అయితే రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తంతో మాత్రమే కొలవలేం. రైతు కుటుంబ ఆదాయం ఎంత పెరిగింది? పంటకు గిట్టుబాటు ధర లభిస్తోందా? సాగు వ్యయం తగ్గిందా? రైతు మళ్లీ అప్పుల ఊబిలోకి వెళ్లకుండా వ్యవసాయం లాభసాటిగా మారిందా? అన్నదే అసలు ప్రశ్న. రుణమాఫీ ఒకసారి ఉపశమనం కలిగించవచ్చు. కానీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు, సాగునీరు, మార్కెట్ ధరలు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకపోతే రైతు సంక్షోభం కొనసాగుతుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, నిల్వ సదుపాయాలు, పంట ఆధారిత పరిశ్రమలు, మార్కెట్ అనుసంధానం బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయాన్ని ఆదాయ వనరుగా మార్చాల్సిన అవసరం ఉంది. మహిళల సంక్షేమంలో ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యలుగా నిలిచాయి. ముఖ్యంగా ఉచిత బస్సు ప్రయాణం మహిళల విద్య, ఉపాధి, వైద్యం వంటి అవసరాల కోసం చలనం పెంచే అవకాశాన్ని కల్పించింది. అయితే ఈ పథకాలతో పాటు ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వం, సేవల నాణ్యత, బస్సుల సంఖ్య వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలి. సంక్షేమం తాత్కాలిక ఉపశమనాన్ని ఇవ్వడంతో పాటు కుటుంబాల ఆదాయాన్ని పెంచే ఉపాధి అవకాశాలు కూడా సృష్టించాలి.

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇళ్ల మంజూరు కంటే వాస్తవంగా ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి? అర్హులందరికీ ప్రయోజనం చేరిందా? నిర్మాణ నాణ్యత ఎలా ఉంది? నిధులు సమయానికి విడుదలవుతున్నాయా? అన్నదే ఈ పథకం విజయానికి నిజమైన కొలమానం. అలాగే సామాజిక భద్రతా పింఛన్ల పరిధిని విస్తరించడం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు కనీస ఆర్థిక భరోసాను అందిస్తుంది. అయితే అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను చేరేలా వ్యవస్థను మరింత పారదర్శకంగా చేయాలి. సామాజిక న్యాయం విషయంలో కుల, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచార సేకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రాధాన్యం కలిగినవి. వాస్తవ గణాంకాలు ఉంటేనే వనరుల పంపిణీ, విద్యా అవకాశాలు, ఉపాధి విధానాలు, రిజర్వేషన్లు వంటి అంశాల్లో శాస్త్రీయ నిర్ణయాలు తీసుకోవచ్చు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు శాసనసభ ఆమోదం, ఎస్సీ వర్గీకరణ అమలు వంటి అంశాలు సామాజిక న్యాయ చర్చలో కీలకంగా నిలిచాయి. అయితే రాజకీయ ప్రకటనలను శాశ్వత విధానాలుగా మార్చాలంటే రాజ్యాంగ, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి అమలులోకి తీసుకురావడం అవసరం. ఉద్యోగాల విషయంలో తెలంగాణ యువత ఆశలు అత్యంత ఎక్కువ. ప్రభుత్వం 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు చెబుతోంది. నియామక ప్రక్రియలో పారదర్శకత, పరీక్షల నిర్వహణలో విశ్వసనీయత, ఉద్యోగాల భర్తీలో వేగం యువతలో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కావు. పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, సేవారంగం, చిన్న పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో విస్తృత అవకాశాలు రావాలి. పెట్టుబడులు ప్రకటించడమే కాదు, అవి వాస్తవ పరిశ్రమలుగా మారి స్థానిక యువతకు ఎంత ఉపాధి కల్పించాయో కూడా లెక్కించాలి.

విద్యా, వైద్య రంగాలు కూడా ప్రజా పాలనకు కీలక పరీక్షలు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులతో పాటు బోధన నాణ్యత పెరగాలి. పరిశోధన, సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో పేదలకు ఆర్థిక రక్షణ కల్పించడం అవసరమే అయినా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, పరికరాలు, పరీక్షా సదుపాయాలు మెరుగుపడితేనే ప్రజలకు శాశ్వత ఆరోగ్య భద్రత లభిస్తుంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోంది. సమాచార సాంకేతిక, ఔషధ, సేవారంగాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. అయితే ట్రాఫిక్, కాలుష్యం, వరదలు, తాగునీరు, గృహ వ్యయం, చెత్త నిర్వహణ వంటి సమస్యలు నగర భవిష్యత్తుకు సవాలుగా మారుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి నగరాలను కూడా అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. ప్రాంతీయ అసమానతలు తగ్గితేనే సమతుల్య తెలంగాణ సాధ్యమవుతుంది. ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వృద్ధి, పెట్టుబడుల విషయంలో అనేక విజయాలను ప్రకటిస్తోంది. కానీ పెట్టుబడులు, తలసరి ఆదాయం పెరగడం మాత్రమే ప్రజలందరి జీవన ప్రమాణాలు పెరిగాయని చెప్పడానికి సరిపోదు. ఆదాయ అసమానతలు, గ్రామీణ–పట్టణ వ్యత్యాసాలు, పేద కుటుంబాల కొనుగోలు శక్తి, ఉపాధి స్థిరత్వం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సంక్షేమం అవసరం; కానీ దానితో పాటు సంపద సృష్టి, ఉపాధి కల్పన, ఉత్పాదక పెట్టుబడులు పెరగాలి. అప్పులపై ఆధారపడిన అభివృద్ధి కంటే ఆర్థికంగా స్థిరమైన వృద్ధి నమూనా అవసరం. ప్రజాస్వామిక ప్రజా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకం. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందాలి. పథకాల లబ్ధిదారుల ఎంపిక, టెండర్లు, పనుల పురోగతి, నిధుల వినియోగం వంటి అంశాల్లో పారదర్శకత పెరగాలి. అవినీతికి అవకాశాలను తగ్గించే వ్యవస్థలను బలోపేతం చేయాలి. ప్రజల పన్నులతో సమకూరే ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికే ఉపయోగపడేలా ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించాలి.

వెయ్యి రోజులు ఒక ప్రభుత్వానికి ఒక మైలురాయి మాత్రమే. ప్రజలకు మాత్రం ఇది తమ ఆశలు ఎంతవరకు నెరవేరాయో చూసుకునే అవకాశం. ప్రజా పాలన ప్రజలకు చేరువైతేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. సామాజిక న్యాయం విస్తరించినప్పుడే అభివృద్ధికి అర్థం ఉంటుంది. సంక్షేమంతో పాటు ఉపాధి, ఆర్థిక సాధికారత పెరిగినప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు శాశ్వతంగా మెరుగుపడతాయి. వెయ్యి రోజుల పాలన ముగింపు కాదు... ప్రజల ఆకాంక్షలను మరింత సమర్థంగా నెరవేర్చే తదుపరి ప్రయాణానికి ఇది ఆరంభం. తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి ఇకపై విజయాలను చెప్పుకోవడం కంటే, ప్రజల జీవితాల్లో కనిపించే మార్పులతో వాటిని నిరూపించుకోవడమే అసలు సవాలు.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.